ఘనంగా ప్రారంభమైన రాష్ట్ర జూడో ఛాంపియన్ షిప్ పోటీలు

రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యతనిస్తోంది ఇ: శాప్ చైర్మన్

జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభిస్తున్న రవినాయుడు

రేణిగుంట, నవంబరు 23 ప్రభాతవార్త: రేణిగుంట బాలికల జిల్లా పరిషత్ ప్లస్ టు ఉన్నత పాఠశాలలో శనివారం రాష్ట్ర స్థాయి అండర్-19 బాలబాలికల జూడో పోటీలను ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) చైర్మన్ అనిమిని రవి నాయుడు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన 250 మంది క్రీడాకారులు, 50 మందికి కోచ్‌లు క్రీడల్లో పాల్గొన్నారు. జిల్లా అండర్ విద్యాధికారి విశ్వనాథ్ నాయక్, తిరుపతి డిప్యూటీ ఎడ్యుకేషన్‌ఆఫీసర్ బాలాజీ, డీఎస్‌డీవో సయ్యద్ సాహెబ్, స్టేట్ అబ్జర్వర్ ప్రతాప్‌రెడ్డి, అర్బన్ సీఐ శరత్‌చంద్ర, పాఠశాల ప్రాధానాచార్యులు విష్ణువర్ధని, వ్యాయామ ఉపాధ్యాయురాలు రేఖారాణి, ఎస్‌జీఎఫ్ జాయింట్ సెక్రటరీ సురేష్ సమక్షంలో శాప్ చైర్మన్ రవినాయుడు క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం రవినాయుడు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు క్రీడారంగ అభివృద్ధి అజెండాగా భావిస్తున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న 12.70 కోట్ల క్రీడా ప్రోత్సాహకాలను విడుదల చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్ పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులను మొగ్గ చూపేలా తర్ఫీద్‌ని ఇవ్వడమే కాకుండా, ప్రతి పాఠశాలలో ఆటస్థలాల కేటాయింపుకఉ జీవో జారీ చేసినట్లు తెలిపారు. ఇప్పటికే క్రీడాకారులకు మేలైన క్రీడా సామగ్రిని పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం వేదికపై టీడీపీ తిరుపతి పార్లమెంట్ ఉపాధ్యక్షులు చెర్లోపల్లి సుబ్రహ్మణ్యం, మండల టీడీపీ అధ్యక్షుడు మునిచంద్రారెడ్డి, రేణిగుంట పట్టణ టీడీపీ అధ్యక్షుడు మహబూబ్ బాషా, టీడీపీ సీనియర్ నేతలు పుష్పనాథం, నెల్లూరు సుబ్రహ్మణ్యం, కన్నన్‌రెడ్డి, తదితరులతో పాటు అధికార ప్రతినిధులు రవినాయుడును శాలువలు కప్పి ఘనంగా సత్కరించారు.

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

విద్యార్థుల అభ్యసనా... సామర్థ్యాలు పెంచేలా బోధన

విద్యార్థులకు అసెస్మెంట్ కార్డులు : కలెక్టర్

వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, నవంబర్ 23 ప్రభాతవార్త: పాఠశాల విద్యార్థులకు అసెస్మెంట్ కార్డుల పంపిణీ కార్యక్రమం పక్కాగా నిర్వహించాలని, మండల స్థాయిలో మండల విద్యాశాఖ అధికారి, తహసిల్దార్లు, ఎంపిడిఓలు ఈ కార్యక్రమం పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. మెగా పేరెంట్స్‌టీచర్స్ మీటింగ్ కార్యక్రమం నిర్వహణపై కలెక్టర్ సుమిత్‌కుమార్ శనివారం కలెక్టరేట్ నుండి జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మీ, సమగ్రశిక్ష ఎసిపి వెంకటరమణారెడ్డి, సాంఘీక సంక్షేమశాఖ డిడి డాక్టర్ రాజ్యలక్ష్మీలతో కలిసి మున్సిపల్ కమీషనర్లు, మండల విద్యాశాఖ అధికారులు, తహసిల్దార్లు, ఎంపిడిఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతుల కల్పన జరుగుతున్నదని, విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు పెంచేలా మెరుగైన బోధన విధానం వుండాలన్నారు. బోధన విధానం పర్యవేక్షణలో విద్యార్థుల తల్లిదండ్రుల భాగస్వామ్యం వుండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల, హాస్టల్ విద్యార్థికి అసెస్మెంట్ కార్డులు ప్రభుత్వం ద్వారా అందుతాయని విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాలలకు ఆహ్వానించి ఈ కార్డులను వారికి అందించాలన్నారు. జిల్లా స్థాయి నుండి మండల స్థాయికి కార్డుల పంపిణీ వుంటుందని, పాఠశాలలకు కార్డులు అందిన తరువాత విద్యార్థుల వివరాలను ఉపాధ్యాయులు కార్డులపై నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమ నిర్వహణ ఏర్పాట్లను పాఠశాల స్థాయిలో హెడ్మాస్టర్లు బాధ్యత తీసుకోవాలన్నారు. సిఎం నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు విద్యార్థుల అసెస్మెంట్ కార్డులపై ప్రభుత్వ రాజముద్ర తప్ప మరే ఇతర ఫోటో ముద్రించబడదన్నారు. ఈ కార్యక్రమానికి విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాలకు ఆహ్వానించాలని, పాఠశాలలో విద్యావిధానం, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన విధానం, మంచినీరు, పారిశుధ్యం, రక్తహీనత తదితర సమస్యలను అడిగి తెలుసుకోవాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుండి అభిప్రాయసేకరణ చేసి సమస్యలను ప్రభుత్వానికి నివేదించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు పాల్గొంటారని, ఎంఇఓలతో పాటు తహసిల్దార్లు, ఎంపిడిఓలు పాల్గొనాలని, అలాగే సచివాలయ సిబ్బందిని ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలన్నారు. అలాగే పూర్వ విద్యార్థులను ఈ కార్యక్రమానికి ఆహ్వానించాలన్నారు. అలాగే వైద్యశాఖ ద్వారా రాష్ట్రీయ బాల స్వస్థ కింద విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమం సందర్భంగా విద్యార్థులకు మెడికల్ కార్డులు అందించడం జరుగుతుందని ఈ విషయంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. అలాగూ పాఠశాల స్థాయిలో పేరెంట్ కమిటీని ఏర్పాటు చేయాలని కలెక్టర్ అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎంఇఓలు, ఎంపిడిఓలు, తహసిల్దార్లు పాల్గొన్నారు.

26న చిత్తూరులో జిల్లా స్థాయి యువ ఉత్సవ్ : కలెక్టర్

చిత్తూరు ఎస్వీ సెట్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 26వ తేదీ జిల్లా స్థాయి యువ ఉత్సవ్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లా స్థాయి యువ ఉత్సవ్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను బుధవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్, జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరిలు కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా నెహ్రూ యువకేంద్రాల ద్వారా యువ ఉత్సవ్ కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా చిత్తూరు ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 26వ తేదీన జిల్లా స్థాయి యువ ఉత్సవ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా చిత్రలేఖనం, వ్యాసరచన, కవిత్వం, ఫోటోగ్రఫీ, సైన్స్‌మేళా, వక్తృత్వ పోటీలు, నాట్యపోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 15-29 సంవత్సరాల ఔత్సాహికులు తమకు నచ్చిన పోటీల్లో పాల్గొనవచ్చునన్నారు. వివరాల కోసం 99081 27829ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నెహ్రూ యువజన అధికారి ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తిరుచానూరు బ్రహ్మోత్సవాలలో... విస్తృత ఏర్పాట్లు : తితిదే ఈఓ

-పంచమి తీర్థంకు 15 వందల సిబ్బందితో భద్రతా ఏర్పాటు

మీడియా సమావేశంలో టిటిడి ఈఓ

తిరుచానూరు, నవంబర్ 23, ప్రభాతవార్త తిరుచానూరులో రానున్న పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలలో భక్తులకు ఎటువంటి ఆటంకం కలగకుండా విస్తృత ఏర్పాట్లు చేపట్టనున్నట్లు తితిదే ఈఓ శ్యామలరావు అన్నారు. బ్రహ్మోత్సవ ఏర్పాట్లలో భాగంగా శనివారం తితిదే ఈఓ ఆధ్వర్యంలో తిరుపతి యస్.పి సుబ్బారాయుడు, తిరుపతి జేఈఓ వీరబ్రహ్మం, సీవియస్‌ఓ శ్రీధర్ తిరుచానూరులోని మాడవీధులతో పాటు, పుష్కరిణి, గంగుండ్ర మండపం, సన్నిది వీధి, మొదలగు ప్రాంతాలలో కలియ తిరుగుతూ వివిధ శాఖలతో ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. పాత్రికేయల సమావేశంలో ఈఓ మాట్లాడుతూ రానున్న 28వ తారీకు నుండి 6వ తేది వరకు జరగనున్న ఉత్సవాలలో భక్తులు సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేపట్టేలా వివిధ శాఖలవారికి దిశానిర్దేశం చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా 6వ తారీకు విశేషంగా నిర్వహించే పంచమీ తీర్థానికి విచ్చేసే వేలాది భక్తుల దృష్ట్యా మూడు హోల్డింగ్ పాయింట్లు ఏర్పాటు చేశామని అన్నారు. ముందురోజు రాత్రికే చేరుకునే భక్తులకు భోజనం, మంచి నీరు, ఉదయాన్న మరుగుదొడ్లు, క్యూలైన్లు ఏర్పాటు చేసామని అన్నారు. పంచమి రోజు తిరుమల నుండి గజారాజులపై విచ్చేసే సారెకు రహాదరి పొడవున కావలసి బద్రతా ఏర్పాట్లు చేసామని తెలిపారు. యస్.పి సహకారంతో పార్కింగ్, సిసి కెమరాలు,ఇతర బద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆగమ సలహాదారులు శ్రీనివాసులు, డిప్యూటీ ఈఓ గోవిందరాజన్, తిరుచానూరు సిఐ సునీల్ కుమార్, ఏవియస్‌ఓ సతీష్ వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వైన్స్ షాపులో నిల్... బెల్టుషాపులో ఫుల్!

- చోద్యం చూస్తున్న ఎక్సైజ్, పోలీసుశాఖ

నాయుడుపేట/చిట్టమూరు, నవంబర్ 23 ప్రభాతవార్త : మద్యం అక్రమ అమ్మకాలకు అడ్డు అదుపు లేకుండా పోతోంది. విచ్చలవిడి విక్రయాలతో చిట్టమూరు, నాయుడుపేట మండలాల్లోని ప్రతి పల్లె, పట్టణంలో మద్యం ఏరులై పారుతోంది. పచ్చని పల్లెలన్నీ చీకటి పడితుచాలు... బెల్టు దుకాణాల్లో దొరికే మద్యం బాటిళ్ల మత్తులో వ్యాపారం యమా కిక్కుగా ఉంటోంది. మద్యం వ్యాపారంలో ఆరితేరిన వారు ఇందులో పధ్రాన పాత్ర పోషిస్తున్నారు. మద్యం దుకాణాల వేలంలో అవకాశం దక్కని వారు, వారి అనుచరగణంతో బెల్టు దుకాణాల ద్వారా అక్రమంగా అమ్మకాలు జరుపుతూ ప్రజలను నిలువు దోపిడీకి గురిచేస్తున్నారు. 10 నుంచి 15 శాతం మేర అధికంగా ధరలు పెంచి బాటిళ్లు విక్రయిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా బెల్టు దుకాణాలన్నీ విచ్చలవిడిగా సాగుతున్నా పోలీసు, ఎక్సైజ్ శాఖ అధికారులు మాత్రం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బెల్టుషాపులతో పేద కుటుంబాలు చిన్నాభిన్నం అవుతాయని, బెల్టు షాపులు నిర్వహిస్తే తీవ్ర పరిణామాలు, కేసులు ఎదుర్కోవాల్సి వస్తుందని స్వయానా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటించారు. అయినా లైసెన్స్ మద్యం దుకాణాలు దక్కించుకున్న వారు విచ్చలవిడితనంపై నియంత్రణే చేయడం లేదు. మద్యం వ్యాపారాన్ని మూడు పువ్వులు.. ఆరు కాయలు అన్న చందంగా మార్చుకునేందుకు వైన్స్ దుకాణాల యాజమాన్యాలు సిండికేట్‌గా మారినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందుకోసం స్థానిక పోలీసులు సైతం సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లుగా సమాచారం. తెర వెనుక ఎక్సైజ్‌శాఖ అధికారులు వంత పాడుతుండటంతో ఈ తంతు సాఫీగా సాగిపోతోంది. బెల్టుషాపు నిర్వాహకులను పావుగా మార్చుకొని విక్రయించిన బాటిళ్లపై కొందరు కమీషన్ పొందుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మద్యం దుకాణాల్లో ఎంఆర్‌పి ధరలకే విక్రయించాల్సి ఉండటంతో కల్పిర కొరతతో అధిక లాభాలను బెల్టు దుకాణాల ద్వారా వ్యాపారులు లాభాలు ఆర్జిస్తున్నారు. మరోవైపు తక్కువ ధర మద్యాన్ని బ్రాండెడ్ పేరుతో ఉన్న ఖాళీ మద్యం బాటిళ్లలో నింపి అధిక మొత్తంలో అమ్మి సొమ్ము చేసుకుంటున్నట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి. నాయుడుపేట సర్కిల్ పరిధిలో 17 మద్యం దుకాణాలు నడుస్తుండగా, చిట్టమూరు మండలంలో నాలుగు ప్రభుత్వ లైసెన్స్ మద్యం దుకాణాలు నడుస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో నాయుడుపేట పట్టణంలో తెరచాటుగా సాగగా, ప్రస్తుతం ఏకంగా ప్రతి కూల్‌డ్రింక్ షాపులు మద్యం దొరుకుతుందనడంలో సందేహం లేదు. అలాగే వాకాడు ఎక్సైజ్ శాఖ పరిధిలో చిట్టమూరు మండలంలో గునపాడు, మల్లాం, యల్లసిరి, కొత్తగుంటలో ప్రభుత్వ మద్యం షాపులు నడుస్తున్నాయి. మండలంలోని 23 పంచాయతీల పరిధిలో ఒక్కో గ్రామంలో బెల్టుషాపులు నడుస్తున్నాయంటే ఎక్సైజ్, పోలీసుల పనితీరు ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. మద్యం షాపుల యజమానులు బెల్టు దుకాణదారులతో కుమ్మక్కయిన ఎక్సైజ్, పోలీసు శాఖ వారు తమ నెలసరి మామూళ్లతో సామాన్యుల జీవితాలను ఛిద్రం చేస్తున్నారు. ప్రభుత్వ పెద్దలు, జిల్లాస్థాయి ఉన్నతాధికారులు మద్యం బెల్టు దుకాణాలను నియంత్రించి బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

విద్యుత్ తీగలు తగిలి గజరాజు మృతి

కల్లూరు, నవంబర్ 23 ప్రభాతవార్త : చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేట పంచాయతీ దేవట్ల వారి పల్లె సమీపంలో మామిడి తోటలో అడవి జంతువుల కోసం తీసిన విద్యుత్ తీగలు తగిలి గజరాజు మృతి చెందినట్లు డిఎఫ్‌ఓ వివేక్ తెలిపారు. మామిడి తోటలో అడవి పందుల కోసం వేటగాళ్లు విద్యుత్ తీగలను అమర్చారు. అయితే గత కొన్ని రోజులుగా పులిచెర్ల మండలంలో తిరుగుతున్న ఏనుగుల గుంపు శుక్రవారం రాత్రి చిన్నగొట్టిగల్లు మండలంలోకి ప్రవేశించి దిగవూరు అరకేలవారిపల్లె గ్రామా పొలాల గుండా దేవట్ల వారిపల్లె సమీపంలో అదే గ్రామానికి చెందిన రైతు శంకర్ రెడ్డి సాగుచేసిన టమోటా మామిడి చెట్లను ధ్వంసం చేశాయి. ఒక ఏనుగు కాళ్లకు తీగలు తగలడంతో తొండంతో విద్యుత్ తీగలను లాగడంతో విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న డీఎఫ్‌ఓ వివేక్ , డీసీఎఫ్ సెల్వం, ఎఫ్ ఆర్ వో వెంకటరమణ, ట్రాన్స్ కో ఏ ఈ రియాజ్ అహ్మద్ సంఘటన స్థలానికి చేరుకుని గజరాజు మృతిపై ఆరా తీశారు. జూ పార్క్ వైద్యులు తోయ్ బా సింగ్ వైద్య బృందం భాకరాపేట పశువైద్యాధికారి స్రవంతి ఆధ్వర్యంలో గజరాజుకు పోస్టుమార్టం చేసి అక్కడే పూడ్చివేశారు.

అమర రాజాచే... వెల్నెస్ రన్

రేణిగుంట, నవంబరు 23 ప్రభాతవార్త: అమర రాజా కంపెనీస్ లిమిటెడ్‌లో విధులు నిర్వహిస్తున్న కార్మికులు, ఉద్యోగుల మానసిక ఒత్తిడి తగ్గించడానికి కంపెనీ నా ఆరోగ్యం నా బాధ్యతలో భాగంగా శనివారం ఏఆర్ బుడ్డి మూడు నుంచి 5 కి.మీ వెల్నెస్ రన్ నిర్వహించింది. సుమారు 1000 మంది రన్‌లో పాల్గొన్నారు. కార్మికుల ఆరోగ్య భద్రత ఫిట్‌నెస్‌లో భాగంగా ప్రతి ఏడాది రన్ నిర్వహిస్తామని అమరరాజా ప్రతినిధులు తెలిపారు. రన్‌లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రోత్సాహకంగా పతకాలను బహుకరించారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల జీవనశైలి ఆహ్లాదకరంగా ఉంటుందన్నారు. ఏఎస్‌బీయూ ఆపరేషన్ హెడ్(కరకంబాడి) మునీశ్వరనాయుడు, మంగళ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ బిజినెస్‌ఫైనాన్స్ హెడ్ సతీష్ కుమార్, ఎస్‌బీయూ టూల్ వర్క్స్ హెడ్ కిషన్ కోన జెండా ఊపి ప్రారంభించారు.

అనుచరులైతే చాలు... ప్రభుత్వ స్థలాలు ఇస్తాం!



-నాయకుల మనుగడ కోసం 33, 99 సంవత్సరాలకు లీజుకు
-గత నాయకుల వారసత్వాన్ని కొనసాగిస్తున్న ప్రస్తుత నాయకులు

శ్రీకాళహస్తి రాజకీయ నాయకుల తీరు ప్రత్యేకంగా ఉంటుంది. మరెక్కడ లేని విధంగా తమ అనుచరులంటే మునిసిపల్ ఆస్తులను, దేవాదాయ స్థలాలను 'నజరానా' అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తి మున్సిపాలిటికి సంబంధించిన పాత నెల్లూరు బస్టాండు వద్ద ఉన్న పెట్రోల్ బంకును మూయించి, ఈ స్థలాన్ని 33 సంవత్సరాల లీజుకు అప్పటిలో ఓ కౌన్సిలర్‌కు అప్పగించారు. గత పాలనలో జయరామారావు వీధిలోని ఓ దేవస్థానం స్థలాన్ని గుట్టు చప్పుడులేకుండా తన అనుచరుడికి 99 సంవత్సరాల లీజుకు అప్పగించారు. నాలుగురోజుల క్రితం పట్టణ నడిబొడ్డులోని రాజగోపురం ఎదురుగా ఇనుప స్థంభాలు వెలిసినాయి. అంటే ప రాజకీయ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నాయకులు తమ అనుచరులకు శివయ్య, మునిసిపల్ ఆస్తుల్ని అప్పగించుటకే వెనుకాడటం లేదు శ్రీకాళహస్తి రాజకీయ నాయకులు

శ్రీకాళహస్తి,నవంబర్ 23 ప్రభాతవార్త :
శ్రీకాళహస్తి పట్టణంలో గత రాజకీయ నాయకుల వారసత్వాన్ని ఇప్పటి నాయకలు కూడా కొనసాగిస్తున్నారు. తన అనుచరులకు పట్టణంలోని ప్రభుత్వ స్థలాను అప్పనంగా అప్పగిస్తేన్నారు. పట్టణం, ఆలయాల భవిష్యత్తు అవసరాలకు ప్రభుత్వ స్థలాలు అవసరం వున్నా, వాటిని పక్కపెట్టి తన అనుచరులకు కట్టబెట్టేస్తున్నారు. అయితే ఏ రాజకీయ నాయకుడు గెలవాలన్నా ఓడాలన్న దేవస్తానంలో ఆచరించే విధానాలు కీలకంగా ఉంటున్నాయి. పట్టణ నడిబొడ్డులో ఉన్న ఆలయంలో ఏం జరుగుతుంది? నాయకులు, పాలకుల తీరు ఎలా ఉంది? అనే అంశాలను ప్రజలు క్షుణ్ణంగా గమనిస్తుంటారు.ఇటీవల ఆలయానికి సమీపంలోని రాజగోపురం ఎదురుగా దేవస్థానం ఖాళీ స్థలాన్ని ఆక్రమించుకోవటానికి ప్రయత్నాలు జరిగాయి. అయితే ఇది ఎవరి మద్దతుతో ఇంత ధైర్యంగా ఇక్కడ పోల్స్ నాటారన్నది చర్చనీయాంశంగా మారింది. ప్రతిపక్షాల వారు, సామాన్యులు అయితే ఇంత ధైర్యం చేయరనే చర్చ జరుగుతుంది. అయితే ఇది అధికార పార్టీ నాయకుల మద్దతుతోనే బీజం పడిందనే అంశం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

జయరామారావువీధిలో...

శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబంధించి కొన్ని దశాబ్దాల నుంచి జయరామరావువీధిలో పాత విద్యుత్ ఇఆర్‌ఓ కార్యాలయం ఉండేది. ఆ శాఖ సొంత భవనాలు నిర్మించుకున్న తరువాత ఆ భవనాన్ని పడగొట్టారు. దాంతో ఆ ఖాళీ స్థలంలో గతంలో పరిపాలించిన నాయకుడు తమ అడుగులకు మడుగులొత్తి పార్టీలో చేరినందుకు నజరానాగా 99 సంవత్సరాల లీజుకు అప్పగించారు. అయితే ఈ అంశం పట్టణంలో గుప్పుమంది. అస్మదీయులైతే దేవుని సొత్తులు ధారాదత్తం చేయటానికి కూడా నాయకులు వెనుకాడరనే విమర్శలు చోటు చేసుకున్నాయి. నాయకులకు ఫ్లెక్సీలు కట్టి,జయహో అంటే దేవుని మాన్యాలు, ఆస్తుల్ని లీజుకు ఇచ్చుకునే సంప్రదాయానికి శ్రీకారం చుట్టారు. కాగా గతంలో శ్రీకాళహస్తి మున్సిపల్ కౌన్సిల్‌లో ఓ అధికార పార్టీ కౌన్సిలర్ పేరుతో మున్సిపాలిటికి సంబంధించిన ఆస్తుల్ని 33 సంవత్సరాల లీజుకు ధారదత్తం చేసారు.

మంచినీటి సమస్య... పరిష్కారంకు 3.73 కోట్లు

- కరువు మండలాలకు ప్రాధాన్యత
- వేసవిని సమర్ధవంతంగా ఎదుర్కొనడమే లక్ష్యం !!

కుప్పం, నవంబర్ 23 ప్రభాతవార్త : ఈఏడాది ఖరీఫ్ సీజన్‌లో కుప్పం నియోజకవర్గంలో ఆశించిన మేర వర్షాలు కురవని విషయం విదితమే. వర్షాలు లేకపోవడంతో చెరువుల్లో చుక్క నీరు లేకుండా పోయింది. రాష్ట్ర ప్రభుత్వం సైతం కుప్పం నియోజకవర్గంలో నెలకొన్న కరువు పరిస్థితుల దృష్ట్యా నియోజకవర్గంలో ఉన్న గుడుపల్లె, శాంతిపురం, రామకుప్పం, కుప్పం మండలాలను కరువు మండలాలుగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో ప్రజలకు మౌలిక అవసరమైన మంచినీటి సమస్య నివారణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ కుప్పం నియోజకవర్గంలో 118 గ్రామాల్లో రక్షిత మంచినీటి సమస్య పరిష్కారంకు గాను 3కోట్ల 73లక్షల 70వేల రూపాయల నిధులను ఎస్‌డిఆర్‌ఎఫ్ నిధుల కింద మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో కుప్పం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ప్రజలకు తాగునీటిని అందించేందుకు అవసరమైన చోట్ల నూతన బోర్ల డ్రిల్లింగ్ పనులకు శ్రీకారం చుట్టనున్నారు. గుడుపల్లె మండలంలో 21 గ్రామాలు, కుప్పం మండలంలో 46 గ్రామాలు, రామకుప్పం మండలంలో 24 గ్రామాలు, శాంతిపురం మండలంలో 27 గ్రామాల్లో మంచినీటి బోర్లను డ్రిల్ చేయడంతో పాటు వాటికి అవసరమైన మోటార్లు, పైపులైన్లు ఏర్పాటుచేసి ప్రజలకు మంచినీటి సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. కుప్పం నియోజకవర్గంలో కరువు పరిస్థితులు నెలకొన్న దృష్ట్యా నీటి సమస్యను ఇదివరకే గ్రామాల్లో గుర్తించిన గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులు త్వరితగతిన గ్రామాల్లో కొత్తగా బోర్లు వేసి నీటి సమస్య పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. వీటికితోడు అవసరమైన గ్రామాల్లో రైతుల బోర్లను టైఅప్ చేసి నీటి సరఫరా చేయడంతో పాటు ట్యాంకర్లతో సైతం నీటిని సరఫరా చేసి వచ్చే ఏడాది వేసవిని సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ చర్యలు చేపడుతున్నారు.

గ్రామాల్లో పైపులైన్ల నిర్వహణ కీలకం :

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మంచినీరు అందించేందుకు తగు చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో నీటి సరఫరాకు సంబంధించి పైపులైన్ల నిర్వహణ కూడా కీలకంగా మారింది. గ్రామాల్లో ముందుగానే పగిలిన పైపులైన్లను, కొళాయిలను ఎప్పటికప్పుడు గుర్తించి బాగు చేయించడం వంటి చర్యలు చేపడితే గ్రామాల్లో నీటి సమస్య ఉత్పన్నం కాదు. వీటికితోడు ఇప్పటికే ఉన్న ప్రభుత్వ బోర్లకు అవసరం ఉన్న చోట అదనపు పైపులు వేయాల్సి ఉంటే వాటిని ముందుగానే గుర్తించి వాటిని ఏర్పాటుచేయాల్సిన అవసరం ఉంది. ఈ విషయంగా గ్రామీణ నీటిసరఫరా శాఖ అధికారులు ఎంపిడిఒలు, పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక చొరవ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అసాంఘిక కార్యకలాపాలపై... చర్యలు చేపట్టాలి

జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బారాయుడు

స్టేషన్ రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ

బుచ్చినాయుడు కండ్రిగ, 23 ప్రభాతవార్త: ప్రజా రక్షణ కోసమే పోలీస్ వ్యవస్థ ఉందని, శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తూ అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వ్యక్తులపై మోపాలని జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బారాయుడు పోలీసు అధికారులకు ఆదేశించారు. శనివారం రాత్రి శ్రీకాళహస్తి సబ్ డివిజన్ పరిధిలోని బుచ్చినాయుడు కండ్రిగ పోలీస్‌స్టేషన్‌ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌ఫోర్స్‌మెంట్ విధులు పెంచాలని, అనుమానితులు, పాత నేరస్తులపైనిరంతరం అప్రమత్తంగా ఉంటూ బీట్ సిస్టం బలోపేతం చేసి అధికారుల పర్యవేక్షణ నిరంతరాయంగా ఉండాలన్నారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలు, గదులు, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. అనంతరం జనరల్ డైరీ, కేసు డైరీ, కోర్టు క్యాలెండర్ వంటి రికార్డులను పరిశీలించి తీసుకోవలసిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. శ్రీకాళహస్తి సబ్ డివిజన్ బీఎన్ కండ్రిగ పోలీస్‌స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా గట్టి నిఘా స్టేషన్ పరిధిలోని గ్రామాలను సందర్శించి సభలు సమావేశాలు ఏర్పాటు చేసి సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రూపు తగాదాలు లేకుండా కౌన్సిలింగ్ ఇచ్చి ప్రశాంతమైన వాతావరణం ఉండేలాగా చర్యలు తీసుకోవాలన్నారు. పాత, కొత్త నేరస్తులు, అనుమానితులు, కదలికలపై గట్టి నిఘా ఏర్పాటు చేసి శాంతిభద్రతలను కాపాడాలన్నారు. గాంజా, మత్తు పదార్థాల వంటి అక్రమ రవాణాపై ఉక్కు పాదం మోపి ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా చూడాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో కూడా అక్రమ రవాణాను ఉపేక్షేంచేది లేదని చట్టానికి, చట్టబద్ధతకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. పోలీస్‌స్టేషన్‌కు అందే ఫిర్యాదులను నిష్పక్షపాతంగా నిజాయితీగా విచారించి, ఇరుపక్షాల సమక్షంలో ప్రారంభంలోనే పరిష్కరించి గ్రూపు తగ

అక్రమంగా తరలుతున్న కలప!

వి.కోట, నవంబర్ 23 ప్రభాతవార్త :

వి.కోట మండలంలో కలప అక్రమ రవాణా యధేచ్ఛగా సాగుతోంది. పచ్చటి చెట్లను కలప వ్యాపారులు నేలకూల్చి వేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గుట్టలు, గట్లపై ఉన్న వివిధ రకాల చెట్లను నరికేసి రోజుకు ముప్పై నుంచి నలభై లోడ్ల దాకా కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలతో పాటు స్థానికంగా ఉన్న సామిళ్లకు తరలించి సొమ్ము చేసుకుంటు న్నారు. అసలే వర్షాలు తక్కువగా కురవడంతో పాటు మరో పక్క పచ్చటి చెట్లు సైతం నేలకూలుతుండడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పచ్చటి ప్రకృతి సైతం కనుమరుగవుతోంది. అక్రమ కలప రవాణాను అరికట్టాల్సిన అటవీ అధికారులు పట్టపగలే కలప అక్రమ రవాణా జరుగుతున్నా కనీసం పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. కొంతమంది అటవీ సిబ్బంది అక్రమ కలప రవాణాదారులనుంచి వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు సైతం వస్తున్నాయి. ఇప్పటికైనా అటవీ అధికారులు స్పందించి అక్రమ కలప రవాణాపై తగు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు

ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యం

పూతలపట్టు, నవంబర్ 23 ప్రభాతవార్త:

ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్య వైఖరీ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తోంది. పూతలపట్టు మండల పరిధిలో మన్నారపల్లి వైఎస్ఆర్ కాలనీలో నూతనంగా నిర్మించిన ఇంటిపైనే విద్యుత్ తీగలు వేలాడుతున్నాయి. తమ ఇంటిపైన వెళ్తున్న విద్యుత్ తీగలను తీసి వేసి లైను మార్చాలని గృహ యాజమాని పలుమార్లు ట్రాన్స్‌కో అధికారులను కలిసి విన్నవించుకున్నప్పటికీ ఫలితం వుండటం లేదు. ఇంటి మిద్దెపై విద్యుత్ తీగలు చేతికి అందేవిధంగా వుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ట్రాన్స్‌కో అధికారులు ఇప్పటికైనా స్పందించి ఇంటిపైన వేలాడుతున్న విద్యుత్ తీగలను తొలగించాలని వెంకటేష్ వేడుకుంటున్నాడు.

జాబ్‌మేళా ద్వారా 22 మందికి ఉద్యోగాలు

చిత్తూరు, నవంబర్ 23 ప్రభాతవార్త: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయం, సీడప్(ఎస్ఇఇడిఎపి) సంయుక్తంగా జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయ ఆవరణలో శనివారం నిర్వహించిన జాబ్‌మేళాలో 22 మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు లభించాయి. ఈ జాబ్‌మేళాకు బహుళ జాతీయ సంస్థలైన కీర్తి మెడికల్ స్టోర్స్ ప్రైవేటు లిమిటెడ్, ఎన్ఎస్ ఇన్‌స్ట్రూమెంట్స్, జిప్రో, పేటిఎం సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ జాబ్ మేళాకు 41 మంది అభ్యర్థులు హాజరు కాగా అందులో 22 మంది అభ్యర్థులను వివిధ కంపెనీల ప్రతినిధులు ఉద్యోగాల కోసం ఎంపిక చేసినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి గుణశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు.

నేటి నుండి అధికారులతో మున్సిపల్ మార్కెట్ ఫీజు వసూలు

చిత్తూరు, నవంబర్ 23 ప్రభాతవార్త: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆదివారం నుండి మున్సిపల్ అధికారులు, సిబ్బంది మార్కెట్ ఫీజు, ప్రైవేటు బస్సుల పార్కింగ్ ఫీజు వసూలు చేస్తారని మున్సిపల్ కమీసనర్ నరసింహప్రసాద్ తెలిపారు. మార్కెట్ ఫీజు, పార్కింగ్ ఫీజు టెండరుదారులు డబ్బులు చెల్లించకపోవడంతో ఆ టెండరును రద్దు చేసి నగరపాలక సంస్థ అధికారులతో ఆదివారం నుండి ఫీజులు వసూలు చేస్తున్నట్లు తెలిపారు. చిత్తూరు నగర పాలకసంస్థ పరిధిలోని కూరగాయల మార్కెట్లు, జంతు వధశాలలు, ఎన్టీఆర్ బస్టాండ్, పాత బస్టాండ్, నగర పరిధిలోని ఇతర ప్రాంతాల్లోని మార్కెట్లు, ప్రైవేటు బస్సుల పార్కింగ్ ఫీజు వసూలు చేపట్టడానికి మున్సిపల్ అధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు కమీషనర్ తెలిపారు. రెవెన్యూ అధికారులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, కేటాయించబడిన అడ్మిన్ కార్యదర్శులు విధులు నిర్వర్తించి మార్కెట్ ఫీజులు వసూలు చేయాలని కమీషనర్ తెలిపారు.

వాలీబాల్‌కు పెట్టిన పేరు బంగారుపాళ్యం : మాజీ జడ్పీ ఛైర్మన్

బంగారుపాళ్యం, నవంబర్ 23 ప్రభాతవార్త: వాలీబాల్ క్రీడకు బంగారుపాళ్యం పెట్టిన పేరుగా నిలిచిందని మాజీ జడ్పీ ఛైర్మన్, సీనియర్ వాలీబాల్ క్రీడాకారుడు ఎంబి కుమార్‌రాజా అన్నారు. శనివారం రాత్రి బంగారుపాళ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వాలీబాల్ కోర్టుకు నూతనంగా ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేశారు. ఈ ఫ్లడ్‌లైట్లను కళ్యాణ్, ఈశ్వర్‌లు రూ.1.50 లక్షలు వ్యయం చేసి లైట్లు అమర్చారు. ఈ నూతన ఫ్లడ్‌లైట్లను మాజీ జడ్పీ ఛైర్మన్ ఎంబి కుమార్‌రాజా స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఫ్లడ్‌లైట్ దాత కళ్యాణ్, మండల టిడిపి అధ్యక్షులు ఎన్‌పి జయప్రకాష్, మాజీ జిల్లా వాలీబాల్ కోచ్ సుదర్శన్‌నాయుడు, పలువురు వాలీబాల్ క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

గుడ్‌టచ్ బ్యాడ్ టచ్‌పై విద్యార్థులకు అవగాహన

బంగారుపాళ్యం, నవంబర్ 23 ప్రభాతవార్త: స్థానిక

ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు శనివారం గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై విద్యార్థులకు బంగారుపాళ్యం పోలీసులు అవగాహన కల్పించారు. విద్యార్థులను ఉద్దేశించి ఇన్స్పెక్టర్ కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి వుండాలని సూచించారు. ఎవరైనా బ్యాడ్ టచ్‌గా ప్రవర్తిస్తే ప్రతిఘటించాలని విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహారాష్ట్ర ఎన్నికల్లో ఎన్డీఏ ప్రజావిజయం

– బీజేపి సీనియర్ నాయకులు చిట్టిబాబు

చిత్తూరు, నవంబర్ 23 ప్రభాతవార్త:

మహారాష్ట్ర ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి భారీ విజయం లభించడం ప్రజా విజయమని జిల్లా బిజెపి సీనియర్ నాయకులు కొల్లా చిట్టిబాబు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రధాని నరేంద్రమోడి ఆధ్వర్యంలో మహారాష్ట్రలో ఎన్డీఏ కూటమి గతంలో కంటే ఎక్కువ సీట్లను కైవసం చేసుకొందని, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కోలుకోలేని విధంగా దెబ్బతినడంతో దేశ వ్యాప్తంగా ప్రజలు కాంగ్రెస్‌ను మరిచిపోయే పరిస్థితిని తెప్పించారన్నారు.

సంస్కృతశాఖ బిఓఎస్ ఛైర్పర్సన్ గా శీరిష

తిరుపతి విద్య, నవంబర్23 ప్రభాతవార్త: శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం సంస్కృత శాఖ అధ్యాపకురాలు ఆచార్య గుండ్లపల్లి శీరిష బిఓఎస్ ఛైర్పర్సన్ గా నియమితులైనారు. ఆమె నియామక పత్రాన్ని వర్సిటీ ఉపకులపతి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య మాదాల భూపతినాయుడు చేతులమీదుగా అందుకున్నారు. ఆమెకు మొదటి సారిగా బిఓఎస్ ఛైర్పర్సన్‌గా నియామకం కావడాన్ని వర్సిటీలో అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.

తిరుపతి డివిజన్

అనుమానితులకు రుయాలో వైద్య పరీక్షలు

తిరుపతి విద్య, నవంబర్ 23 ప్రభాతవార్త: జాతీయ సంస్కృత వర్సిటీలో గంజాయి వాడుతున్నారనే ఆరోపణలపై మీడియాలో వచ్చిన వార్తలు వాస్తవాలకు దూరంగా ఉన్నాయని రిజిస్ట్రార్ రమాశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. వర్సిటీలో పాక్ శాస్త్రీ చదువుతున్న కొందరు విద్యార్థులు తరగతులకు హాజరు కావడం లేదని తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. దీంతో హాస్టల్స్ అధికారులు బాలుర వసతిగృహాలలో తనిఖీలు నిర్వహించాలని ఆదేశించామని పేర్కొన్నారు. దీంతో తెలియని మత్తు పదార్థాన్ని కొందరు విద్యార్థులు వినియోగించినట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. వెంటనే అనుమానితులను గుర్తించి రుయాసుపత్రికి నిర్ధారణ పరీక్షల నిమిత్తం పంపడం జరిగిందని చెప్పారు. ఆసుపత్రి నివేధికలు పరిశీలించి, యాంటీ డ్రగ్స్ కమిటీ సిఫార్సుల ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని ఆమె తెలిపారు.

వెంకటసుబ్బారెడ్డి కర్మక్రియల్లో బృందమ్మ

తొట్టంబేడు, నవంబర్ 23 ప్రభాతవార్త :

మండలంలోని పెద్దకన్నలి గ్రామానికి నివాసం ఉంటునన కన్నలి వెంకటసుబ్బారెడ్డి కర్మక్రియలకు ఎంఎల్ఏ బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి మాతృమూర్తి బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి హాజరై ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో తిరుపతి పార్లమెంటు రైతు ఉపాధ్యక్షులు తక్కల ప్రకాష్‌నాయుడు, ధనంజయనాయుడు, పాపిరెడ్డి, శివశంకర్‌రెడ్డి, గోగినేని సురేష్‌నాయుడు, గోగినేని భాస్కర్‌నాయుడు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వర్సిటీలో గంజాయి ఆనవాళ్లు దారుణం

తిరుపతి విద్య, నవంబర్ 23 ప్రభాతవార్త: ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన జాతీయ సంస్కృత వర్సిటీలో గంజాయి ఆనవాళ్లు కనిపించడం దారుణమని టీటీడీ బోర్డు మెంబర్ భానుప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం వర్సిటీలో వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తిని కలిసి వర్సిటీలో గంజాయి కలకలంపై ఆరా తీశారు. ఇలాంటి సంఘటనలుపునరావృతం కాకుండా అధికారులు కఠినచర్యలు తీసుకోవాలన్నారు.

పట్టణ దేశంకు ఐదుమందితో కమిటీ: చల్లా

పుంగనూరు,నవంబరు 23 ప్రభాతవార్త :

నియోజక వర్గకేంద్రమైన పుంగనూరు పట్టణం లో తెలుగుదేశం పార్టీ కార్యక్ర మాలకోసం ఐదుమందితో కూడిన కమిటీను నియమిం చినట్లు పార్టీ కనీ ్వనర్ చల్లా రామచంద్రారెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా మాచిరాజు రామకృష్ణమరాజు, సివి రెడ్డి, దేశాది ప్రకాష్,ఎం.శ్రీకాంత్ మొదలియార్, సయ్యద్ సుహేల్‌బాషాలను పట్టణంలో పార్టీ విధివిధానాలు అమలు, నిర్వహణ,బాధ్యతలపై నిర్ణయం తీసుకునేందుకు ప్రధానంగా నియమించినట్లు ఆయన వివరించారు.

అపార్‌కోసం ఎన్నెన్ని కష్టాలో

పుంగనూరు రూరల్ నవంబర్ 23 ప్రభాతవార్త : విద్యార్థుల భవిష్యత్తు ప్రయోజనాలకోసం కేంద్రం హడావుడిగా ప్రవేశపెట్టిన అపార్ కార్డుల కోసం పట్టణ,గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థుల తల్లితండ్రులు తీవ్ర ఇక్కట్లు ఎదురొ ్కంటున్నారు. ఆధార్ కార్డులలో విద్యార్థి ఇంటిపేరు, పుట్టిన తేదీ సరిగ్గా ఉండాలని ఆదేశాలు రావడంతో ప్రజలు ఆధార్‌సెంటర్లలో పడిగాపులు కాస్తున్నారు. మరోవైపు రాష్ట్రప్రభుత్వం ప్రాంతాల వారిగా ఏఏ పాఠశాల అపార్ నిర్వహణలో వెనుకబడి ఉందో తెలియచేస్తూ ప్రధానోపాధ్యాయులపై తీవ్రమైన ఒత్తిడి పెంచుతోంది. దీంతో పాటూ సర్వర్లుసమస్యగా మారడంతో ప్రజలు తీవ్ర ఇక్కట్టు పడుతున్నారు.

సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించండి : ఏఇ

పుంగనూరు రూరల్ నవంబర్ 23 ప్రభాతవార్త : ప్రజలు సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించాలని,విద్యుత్‌శాఖ ఏఇ మహేంద్రరెడ్డి కోరారు. వినియోగదారులు విద్యుత్‌శాఖ ఆప్ ద్వారా సకాలంలో బిల్లులు చెల్లించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అయితే పట్టణంలో పలుచోట్ల విద్యుత్ చౌర్యం ఆరోపణలు వస్తున్నాయని, ఇటువంటివి నిర్ధారణ అయితే,కఠిన చర్యలు ఉంటాయన్నారు. దీనికితోడు పట్టణంలో విద్యుత్ సంబంధ సమస్యలు తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

చంద్రబాబును కలసిన మైనార్టీనేత చాంద్‌బాషా

కుప్పం, నవంబర్ 23 ప్రభాతవార్త : రాష్ట్ర ముఖ్యమంత్రి సిఎం చంద్రబాబు నాయుడును కుప్పం తెలుగుదేశం పార్టీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి చా ంద్‌బాషా మర్యాదపూర్వకంగా కలిశారు. వెలగపూడిలోని సిఎం కార్యాలయ ంలో చాంద్‌బాషా సిఎంను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనార్టీ విభాగ ంలో యువతకు తగు ప్రాధాన్యత కల్పించాలని సిఎం చంద్రబాబును కోరగా ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. దీనిపై యువనేత చాంద్‌బాషా సిఎం చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

సదరం క్యాంప్ ఏర్పాటుకై కడ పి.డి.కి వినత

కుప్పం, నవంబర్ 23 ప్రభాతవార్త :

కుప్పం నియోజకవర్గంలో దివ్యాంగుల సౌకర్యార్థం సదరం ప్రత్యేక క్యాంప్‌ను ఏర్పాటుచేయించాలని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్‌కు తెదేపా మున్సిపల్ ప్రధాన కార్యదర్శి ఆర్మగం, మాజీ ఎంపిటిసి వేణుగోపాల్, కౌన్సిలర్ సోమశేఖర్ తదితరులు వినతిపత్రం అందించారు. ఇప్పటికే సుమారు 1550మంది దివ్యాంగులు సదరం స్లాట్ కోసం ఎదురుచూస్తున్నార న్నారు. త్వరలోనే క్యాంపు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమలో వాటర్ గిరి, లోకనాథం, శ్రీనివాసులు పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతోనే నాణ్యమైన వైద్య సేవలు

– బిఆర్‌డి ఆస్పత్రి ఛైర్మన్ డా॥ సురేష్‌బాబు

శాంతిపురం, నవంబర్ 23 ప్రభాతవార్త : గ్రామీణ ప్రజలకు తక్కువ ఖర్చుతోనే నాణ్యమైన వైద్య సేవలను బిఆర్‌డి ఆస్పత్రిలో అందిస్తున్నట్లు ఆస్పత్రి ఛైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబు పేర్కొన్నారు. శనివారం శాంతిపురంలో బిఆర్‌డి క్లినిక్‌ను ఎపిఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం దంపతులు, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తమ క్లినిక్‌లో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, కడుపునొప్పి, సంతానంలేనివారికి చికిత్స, సాధారణ కాన్పులు, ఇఎన్‌టి సంబంధిత వ్యాధులకు చికిత్సలు నిర్వహించడం జరుగుతుం దన్నారు. కార్యక్రమంలో ఆస ్పత్రి డైరెక్టర్ డా॥ హరిత మండవ, డా॥ భవాని, డా॥ హేమంత్‌నాయుడు, డా॥ దిలీప్‌కుమార్‌రెడ్డి, నేతలు విశ్వనాథ నాయుడు, వెంకటరమణబాబు, శ్యామరాజుపాల్గొన్నారు.

సిసి రోడ్ల నిర్మాణంకు భూమిపూజ

శాంతిపురం, నవంబర్ 23 ప్రభాతవార్త :మండలంలోని కెనమాకులపల్లి పంచాయతీ గడ్డూరు గ్రామంలో శనివారం నూతన సిసి రోడ్ల నిర్మాణాలకు మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మండల టిడిపి అధ్యక్షుడు విశ్వనాథనాయుడు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో నేతలు జనార్ధ నరెడ్డి, గోవిందస్వామి, శకు ంతల శ్రీనివాసులు, శివశంకర్, పుష్ప నారాయణస్వామి, రమేష్, మురళి, రాజారెడ్డి, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఎంఆర్ఐగా నందారపుదేవి బాధ్యతలు స్వీకరణ

పాలసముద్రం, నవంబర్ 23 ప్రభాతవార్త:

మండల తహసిల్దారు కార్యాలయంలో ఎంఆర్ఐగా నందారపుదేవి శనివారం బాధ్యతలు స్వీకరించారు. తహసిల్దారు అరుణకుమారిని కలిసి జాయినింగ్ లెటర్ ఇచ్చిన ఎంఆర్ఐ నందారపుదేవి తాను కలెక్టరేట్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నానని ఈ మేరకు పాలసముద్రం ఎంఆర్ఐగా బదిలీ

బీజేపీ కార్యాలయంలో సంబరాలు

పుత్తూరురూరల్, నవంబరు 23 ప్రభాతవార్త: భారతీయ జనతా పార్టీ భారతదేశానికి కేంద్ర బిందువైన మహారాష్ట్ర ఎన్నికల్లో ఘన విజయం సాధించింది. ఈ సందర్భంగా పుత్తూరు బీజేపీ నియోజకవర్గ కార్యాలయంలో సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా కార్యదర్శి కె.బాబు, అదే విధంగా అసెంబ్లీ ఇన్‌చార్జి హరిబాబు సంబరాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మహాదేవరాయలు, ఎస్.వి.రమణ నాగరాజు, వెంకటేశులు, బి.వి.రావు, సిద్ధాంతి, శేఖర్‌మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం విధానాలపై శంఖారావాన్నిపూరించండి

పుత్తూరురూరల్, నవంబరు 23 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఈ నెల 26న జరిగే కలెక్టరేట్ ధర్నాను జయప్రదం చేయాలని కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విధానాల పైన శంఖారావాన్ని పూరించి కార్మిక వ్యతిరేక విధానాలపై ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మునిశంకర్, సీఐటీయూనాయకులు విజయకుమారి, లక్ష్మి, లలిత, అంబికా, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

తొలిసారిగా గోవిందుని చెంత

తిరుమల,నవంబర్ 23ప్రభాతవార్తప్రతినిధి:

ప్రజలకు ఆధ్యాత్మిక భావన , మానసిక దృఢత్వం ఎంతో అవసరమని టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి అన్నారు. సహస్రగళార్చన వంటి సామూహిక పారాయణం వల్ల మానవులకు మానసిక దృఢత్వం ఏర్పడుతుందన్నారు. తిరుమల ఆస్థాన మండపం వేదికగా శ్రీమన్నారాయణభక్త బృందం ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల్లోనే తొలిసారిగా శ్రీమన్నారాయణీయం సహస్రగళార్చన నిర్వహించారు. గళార్చనతో సప్తగిరులు పులకించాయి. శనివారం ఉదయం 10.30గంటలకు మొదలైన ఈ కార్యక్రమం సాయంత్రం 6గంటలవరకు నిరాటంకంగా కొనసాగింది. ఇలాంటి కార్యక్రమం నిర్వహిణకు కృషి చేసిన అరుణ, టిటిడి డిఇ చంద్రశేఖర్‌లను ఆయన అభినందించారు.

మహారాష్ట్రలో అభివృద్ధికి పట్టం

తిరుపతి(రవాణా),నవంబర్ 23ప్రభాతవార్త:

దేశంలో ఎన్‌డిఎ ప్రభుత్వంలోని బిజెపి ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో అభివృద్ధి జరుగుతోందని, మహారాష్ట్ర ప్రజలు మరోసారి అభివృద్ధికే విజయం చేకూర్చారని బిజెపి నేతలు అన్నారు. తిరుపతిలో బిజెపి నాయకులు బాణాసంచా పేల్చి స్వీట్లు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు గుండాల గోపీనాథరెడ్డి, చంద్రారెడ్డి, సుబ్రమణ్యంయాదవ్, తొండమనాటి సుబ్రమణ్యం రెడ్డి, చంద్రబాబు, మురళి, మస్తాన్‌ఖ, లక్ష్మయ్య దేవరాజ్, వాసు, కల్యాణి, జయంత్‌కుమార్ పాల్గొన్నారు.

చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

పాడిపరిశ్రమ అభివృద్ధికి మినీగోకులం షెడ్లు

చౌడేపల్లి, నవంబర్ 23 ప్రభాతవార్త : పాడిపరిశ్రమ అభివృద్ధికి మినీగోకులం షెడ్లను ప్రభుత్వం మంజూరు చేస్తున్నట్లు ఎంపిడిఓ లీలామాధవి అన్నారు. స్థానిక మండల పరిపాలనా భవనంలో షెడ్ల నిర్మాణంపై పాడిరైతులకు అవగాహన కార్యక్రమం జరిగింది. మండలంలో ఇజిఎస్ ద్వారా 50మినీ గోకులం షెడ్లు మంజూరయ్యాయన్నారు. రైతులందరూ ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్మాణాలను త్వరితగతిన చేపట్టాలన్నారు. పశువైద్యాధికారులు పవన్‌కుమార్, దినేష్‌రెడ్డి, ఎపిఓ రెడ్డెమ్మ, మండలంలోని రైతులు పాల్గొన్నారు.

మహిళలకు సంఘాలే శ్రీరామరక్ష : ఎపిఎం

చౌడేపల్లి, నవంబర్ 23 ప్రభాతవార్త :

మహిళలకు సంఘాలే శ్రీరామరక్షని ఐకెపి ఎపిఎం సుబ్రమణ్యంఅన్నారు. మండలంలోనిదిగువపల్లి పంచాయతీ యానాది కాలనీ, దేవిరెడ్డిచెరువు ప్రాంతాల్లోని ఎస్టీ మహిళలకు ఐకెపి సంఘాలపై అవ గా హన కల్పించారు. అనంతరం2ఎస్‌హెచ్‌జి సంఘాలే ర్పాటు చేసారు. సిసిసుగుణ,సంఘమిత్ర, పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలను నిర్మూలించాలి

చౌడేపల్లి, నవంబర్ 23 ప్రభాతవార్త :

మాతశిశు మరణాలను నిర్మూలించాలని ఎంపిడిఓ లీలామాధవి, వైద్యాధికారి పవన్‌కుమార్‌లన్నారు. స్థాని క మండల పరిపాలనా భవనంలో ఆరోగ్య, ఐసిడిఎస్‌శాఖల అధికారులు మాతాశిశుమణాలు, గర్భవతుల్లో రక్తహీనత నిర్మూలన, 108, 104సేవలపై అంగన్‌వాడీ, ఆశాకార్యకర్తలకు అవగాహన, వారి కోసం ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను గురించి వివరించారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు రమాదేవి, సులోచనా, వైద్య, ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుభద్రతా నియమాలు పాటించకుంటే చర్యలు : సిఐ

చౌడేపల్లి, నవంబర్ 23 ప్రభాతవార్త : రోడ్డు భద్రతా నియమాలు పాటించకుంటే కఠిన చర్యలు తీసుకొంటామని పుంగనూరు రూరల్ సిఐ రాంభూపాల్ హెచ్చరించారు. చౌడేపల్లి-పుంగనూరు మార్గ మద్యలోని శింగిరిగుంట వద్ద ఆయన వాహనాలను తనిఖీ చేసారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్లు, కార్లు నడిపేవారు సీటు బెల్టు ధరించాలన్నారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గణనాధుని సన్నిధిలో భద్రాచలం దేవస్థానం ఈఓ

కాణిపాకం,నవంబర్ 23 ప్రభాతవార్త: భద్రాచలం దేవస్థానం ఈఓ

రమాదేవి శనివారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆమెకు ఆలయ సూపరెండెంట్ కోదండపాణి, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఇదిలా వుండగా కాణిపాకం ఆలయ గత విశ్రాంత ఈఓ కె.పూర్ణచంద్రరావు శనివారం ఉదయం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థ, ప్రసాదాలను అందజేశారు.

భక్తులతో పోటెత్తిన కాణిపాకం ఆలయం

కాణిపాకం, నవంబర్ 23 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి అలయం శనివారం భక్తుల రద్దీతో పోటెత్తింది. సాధారణంగా ఆలయంలో వారంతపు రోజులు శని, ఆదివారాలు, వరుస సెలవు రోజుల్లో భారీ స్థాయిలో రద్దీ వుంటుంది. ఈమేరకు శనివారం ఆలయ దర్శనార్థం పెద్దఎత్తున తరలివచ్చారు. అలాగే ఉభయ తెలుగు రాష్ట్రంల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాలకు చెందిన భక్తులతో పాటు తిరుమల వెళ్ళే భక్తులు కూడా కాణిపాకం స్వామివారి దర్శనార్థం పెద్దఎత్తున తరలి రావడంతో ఆలయంలో తీవ్రస్థాయిలో రద్దీ నెలకొంది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేపట్టారు.

వేడుకగా శ్రీ సత్యసాయి పుట్టుపండుగ ఉత్సవం

చిత్తూరురూరల్, నవంబరు 23ప్రభాతవార్త: చిత్తూరుపట్టణం, గిరింపేటలోని శ్రీ సత్యసాయి సేవా



సమితి నందు శనివారం శ్రీ సత్యసాయి పుట్టుపండుగ ఉత్సవాలను ఘనంగా నిర్వహించినట్లు సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షులు ఎస్ మధుసూదనం తెలిపారు. ఉదయం 7గంటలకు ఓంకారం, మహానగర సంకీర్తన, హారతి, పతాకం ఆవిష్కరించిన ననంతరం స్వామి వార్లకు అభిషేకం, అష్టోత్తరం పూజలు నిర్వహించారు. ఈ సేవా కార్యక్రమాల్లో సత్యసాయి సేవా సమితి సభ్యులతో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేరాల నియంత్రణపై అవగాహన కల్పించండి: ఎస్పీ

పలమనేరు,నవంబర్ 23 ప్రభాతవార్త: నేరాల



నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పింస్తు ప్రజలను ఎప్పటికప్పుడు చైతన్యవంతులను చేయాలని జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు బైరెడ్డిపల్లె పోలీసులకు సూచించారు. శనివారం బైరెడ్డిపల్లె స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ లోని రికార్డులను తనిఖీ చేశారు

ఆకాశదీపాన్ని ఆవిష్కరించిన ఇఓ దంపతులు

శ్రీకాళహస్తి,నవంబర్ 23 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక మాసం సందర్భంగా శనివారం భక్తి శ్రద్ధలతో ఆకాశ దీపాన్ని ఆవిష్కరించారు. ఆలయం లోని కోట మండపం వద్ద ఆలయ ఇఓ టి.బాపిరెడ్డి దంపతులు పాల్గొని ఆవిష్కరించారు. వేదపండితులు వేద మంత్రాలను పఠిస్తుండగా పౌరోహితులు అర్థగిరి స్వామి శాస్త్రోక్తంగా పూజలు జరిపారు. సూపరింటెండెంట్ సురేష్‌రెడ్డి, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి చిత్రపటం ఊరేగింపు

శ్రీకాళహస్తి, నవంబర్ 23 ప్రభాతవార్త : శ్రీకాళహస్తిలోని సత్యసాయి మందిరం సారధ్యంలో సాయిబాబ జన్మదిన సంబరాల్లో భాగంగా సత్యసాయి చిత్రపటాన్ని ఊరేగించారు. ముత్యాలమ్మగుడి వీధిలోని సాయిబాబ మందిరంలో ఉదయం నుంచి ఘనంగా జన్మదిన వేడుకలు నిరుపేదలకు సహాయం, అన్నదానాలు నిర్వహించారు. ఉదయం నుంచి అలయంలో బాబు చిత్రపటం ముందు భజనలు నిర్వహించారు. రాత్రి చిన్నారుల భజనలు, కోలాటాలతో ఆకట్టుకుంది. నిర్వాహకులు పాండురంగారావు సారధ్యంలో కమిటి సభ్యులు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో విక్రమ్ విద్యార్థుల రాష్ట్ర స్థాయి ప్రతిభ

శ్రీకాళహస్తి, నవంబర్ 23 ప్రభాతవార్త : పట్టణంలోని సత్యసాయిసేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో పట్టణంలోని విక్రమ్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎన్.జాహ్నవి, కె.గాయత్రి, పి.జ్ఞానప్రియ, ఎన్.స్రవంతి, వై.గుణవర్ధన్ మరియు సి.యశస్వినిలు రాష్ట్రస్థాయిలో నిర్వహించిన పోటీల్లో ప్రథమస్థానం సాధించారు. వీరికి కళాశాల డైరెక్టర్ జి.చంద్రశేఖర్, కరస్పాండెంట్ కె.మునిలక్ష్మిలతోపాటు అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ డాక్టర్ జి.చంద్రశేఖర్ మాట్లాడుతూ తమ విద్యాసంస్థల్లో ఉన్నత విలువలతో కూడిన విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతామన్నారు.

26న జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల ముట్టడి

శ్రీకాళహస్తి, నవంబర్ 23 ప్రభాతవార్త : మోడీ ప్రభుత్వం నిరంకుశ విధానాలకు వ్యతిరేఖంగా సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీన దేశ వ్యాప్తంగా జిల్లా కేంద్రాల ముట్టడి కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు అన్నారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో శనివారం వ్యవసాయ కార్మిక సంఘం రైతు సంఘాల ముఖ్యనాయకులు దడాలసుబ్బారావు ఆమట్లాడుతూ మోడీ పాలనలో వ్యవసాయ కార్మిక రంగం కుదేలైందని మండిపడ్డారు. ప్రభుత్వ రంగ సంస్థలు పరిశ్రమలను కార్పొరేటర్లకు దారాదత్తం చేస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో జిల్లా రైతు అధ్యక్షులు దాసరి జనార్ధన్, కార్యదర్శి హేమలత, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు, గంధం మణి, గురవమ్మ, బాలకృష్ణ, ధనంజయులు తదితరులు పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వనమోదు ప్రతి ఒక్కరు తీసుకోండి

శ్రీకాళహస్తి, నవంబర్ 23 ప్రభాతవార్త : తెలుగుదేశంపార్టీ సభ్యత్వ నమోదును ప్రతి ఒక్కరు కార్యకర్తతో పాటు ప్రజలందరు తీసుకోవాలని సోషల్‌మీడియా కన్వీనర్ నాయిబ్రాహ్మణ సాధికార సమితి అధ్యక్షుడు కోట చంద్రశేఖర్ అన్నారు. ఈసందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్, శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యులు బొజ్జలసుధీర్‌రెడ్డి ఆదేశాలతో క్లస్టర్ ఇన్‌ఛార్జి గెడిపూడి విజయకుమార్ సూచనలతో టిడిపి సభ్యత్వ నమోదును నాయిబ్రాహ్మణులు పలువురు తీసుకున్నారు. నిర్వహించారు. కార్యక్రమంలో నాయిబ్రాహ్మణ విభాగం నాయకులు గోపి, కృష్ణమూర్తి, యుగంధర్, శివకుమార్, మహేష్, నరసింహులు, శ్రీను, వెంకటస్వామి, రమేష్, శేషయ్య, నాగరాజు, చంద్ర,రవి, రూపేష్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలు సకాలంలో పరిష్కరించాలి : ఆర్డీవో

తొట్టంబేడు, నవంబర్ 23 ప్రభాతవార్త : రెవెన్యూ సమస్యలు సకాలంలో పరిష్కరించాలని శ్రీకాళహస్తి ఆర్డీవో భాను ప్రకాష్‌రెడ్డి తహశీల్దార్ యు.మధుసూధనరావుకు స్పష్టం చేశారు. శనివారం మండల తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీవో భాను ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారవేదికలో వచ్చే పిర్యాదులకు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తహశీల్దార్‌కు సూచించారు. పరిష్కరించేలేని ఫిర్యాదులు వస్తే అందుకు గల కారణాలు వారికి తెలియజేయాల్సి ఉందని మండలంలో ఫ్రీహోల్డ్ భూములు సమస్యలు పరిష్కరించాలన్నారు. మరోసారి తొట్టంబేడు తహశీల్దార్ కార్యాలయం నుంచి పిర్యాదు వస్తే సహించేది లేదన్నారు. సమావేశంలో తహశీల్దార్ మధుసూధన రావు, డిటి జగన్‌మోహన్,సీనియర్ అసిస్టెంట్ నారాయణ, మండల సర్వేయర్ హరనాథ్, విఆర్‌ఓలు, సచివాలయ సర్వేయర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు సురేష్, నాదముని, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిజమైన కార్యకర్తలకు న్యాయం చేయండి

శ్రీకాళహస్తి, నవంబర్ 23 ప్రభాతవార్త : నిజమైన కార్యకర్తలకు న్యాయం చేయాలని ఎంఎల్‌ఏ బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి సిఎం చంద్రబాబు నాయుడుకు తెలిపారు. శ్రీకాళహస్తి పట్టణంలో ఏళ్ళ తరబడి తెలుగుదేశం పార్టీలోనే ఉంటూ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న ఆర్ముగం శనివారం సిఎంను కలసి వినతిపత్రం ఇచ్చారు. అనంతరం ఆర్ముగంను అభినందిస్తూ పార్టీ అభివృద్ధికోసం నిరంతరం శ్రమించాలన్నారు.

ఎన్.సి.సితో దేశసేవకు అవకాశం

పాకాల, నవంబర్ 23 ప్రభాతవార్త : పాకాల మండలంలో శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 76వ ఎన్.సి.సి దినోత్సవాన్ని ఎన్.సి.సి విభాగం ఆధ్వర్యంలో ప్రధానాచార్యులు సమావేశం నిర్వహించి ప్రసంగించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ ఏ.మొహిద్దిన్ భాష మాట్లాడు తూ ఎన్.సి.సి ద్వారా దేశానికి సేవ చేసే అవకాశం సులభంగా పొందవచ్చన్నారు. ఎన్.సి.సి ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఐక్యమత్యం నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయన్నారు. ఎన్.సి.సి ఆఫీసర్ లెఫ్టెనెంట్ డాక్టర్ ఈశ్వర్ బాబు మాట్లాడుతూ ఎన్.సి.సి ద్వారా (ఎన్.డి.ఏ) నేషనల్ డిఫెన్స్ అకాడమీ ద్వారా గల ఉపాధి అవకాశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ కుమార్, మోహన్ బెహరా, రమణమ్మ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీ లక్ష్మి నారసింహస్వామికి ప్రత్యేక పూజలు

గూడూరు, నవంబర్ 23 ప్రభాతవార్త : కనుమరాయకొండ పై వెలసియు న్న శ్రీ లక్ష్మి నరసింహస్వామి దేవస్థానంలో శనివారం స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ (అన్నదానం)లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి : ఎస్సై

వెంకటగిరి, నవంబర్ 23 ప్రభాతవార్త : వాహనాలు నడిపేవారు కచ్చితంగా నిబంధనలు పాటించాలని ఎస్సై సుబ్బారావు తెలిపారు. వెంకటగిరి పట్టణంలో పలు ద్విచక్ర వాహనాలు, వ్యాన్లను ఆయన తనిఖీ చేశారు. ద్విచక్ర వాహన దారులు డ్రైవింగ్ లైసెన్స్ వాహనానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నంబర్ టు ఎస్సై వెంకటేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల దుకాణదారులు వ్యవహరించాలి

వెంకటగిరి, నవంబర్ 23 ప్రభాతవార్త : ఎరువుల దుకాణదారులు నిబంధనలను కచ్చితంగా పాటించాలని నాగార్జున సాగర్ తెలిపారు. మండలంలోని ఎరువుల షాపులను సహాయ వ్యవసాయ సంచాలకులు నాయుడుపేట, వెంకటగిరి డాక్టర్ ఎం సుచేంద్ర ప్రసాద్, డాక్టర్ ఎం. నాగార్జున సాగర్ వారు తనిఖీలను నిర్వహిం చడం జరిగినది. ఇందులో భాగంగా ప్రతీ ఒక ఎరువుల డీలరు ఖచ్చితముగా ఓ ఫారములను వారి యొక్క ఎరువుల లైసెన్సు నందు నమోదు పరుచుకుని వ్యాపార లావాదేవీలను నిర్వహించవలెనని వెంకటగిరి మండలము నందుగల డీలర్‌లకు సూచనలు ఇవ్వడము జరిగినది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వెంకటగిరి పి.సుజాత, డీలర్‌లు పాల్గొన్నారు.

ఎస్‌డికె నగర్‌లో ఆకతాయిల ఆగడాలు!

శ్రీకాళహస్తి,నవంబర్ 23 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి పట్టణానికి తూర్పున దిన దినాభివృద్ధి చెందుతున్న ఎస్‌డికె నగర్ ఆకతాయిల వెకిలి చేష్టలు పెచ్చుపెరిగి పోతున్నాయి. టూటౌన్ పోలీసులు రాత్రి వేళల్లో ఒకసారి రౌండ్‌వేసి పరిపెడుతున్నారు. అయితే అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతాల్లో ఓ వైపు దొ ంగ తనాలు మరోవైపు ఆకతాయిల, వెకిలి చెష్టలతో బాలికలు చదువులకు దూర మౌతున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. పాఠశాలలకు వెళ్ళె ఉదయం తిరిగి ఇళ్ళకు చేరే సాయంత్రం వేళల్లో కొందరు ఆకతాయిలు ఫైర్‌స్టేషన్ నుంచి దక్షిణ కైలాస్‌నగర్ వరకు ఆకతాయిల ఆగడాలు శృతి మించుతున్నాయి. ఈ సమస్యలు స్థానిక డివైయస్‌పికి కూడా విన్నవించారు.అయితే టూటౌన్ పోలీసుల పరిధిలో ఉన్న ఈ ప్రాంతాల్లో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసి విద్యార్థులకు ధైర్యం కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఘనంగా సత్యస్సాయి బాబా జయంతి వేడుకలు

నగరి, నవంబరు 23 ప్రభాతవార్త: సత్యసాయి బాబా జయంతి వేడుకలను సాయిమందిర నిర్వాహకులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయం వద్ద సత్యసాయి చిత్రపటాన్ని పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు, సాయిభజనలు చేశారు. ధూప, దీప హారతులు ఇచ్చారు. అనంతరం టీఆర్ కండ్రిగ వద్ద సిరీడ్స్ దివ్యాంగుల పాఠశాలలోని దివ్యాంగులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు లాయర్ మురళీధర్, రమణ, లీలావతి, సావిత్రమ్మ, భాస్కర్, పాఠశాల నిర్వాహకులు పాల్గొన్నారు.

ఆర్‌సీఆర్‌లో విద్యామణి మకుటాలు

రేణిగుంట, నవంబరు 23 ప్రభాతవార్త: రేణిగుంట మండలం కరకంబాడి ఆర్‌సీఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ టెక్నాలజీ కళాశాల విద్యార్థులు ఎంబీఏ నాలుగో సెమిస్టర్ ఫలితాలు తమ సత్తావాటి విద్యా మణిమకుటాలుగా అందరి మన్ననలు పొందుతున్నారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం శనివారం విడుదల చేసిన ఫలితాల్లో బి.యశస్విని(8.22), సి.మాధవి (8.20), ఎస్.హర్ష వర్ధని (8.18), పి.దివాకర్(8.08), ఎం.మమత(8.06) జీపీఏ గ్రేడ్ మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. అత్యధిక గ్రేడ్ మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ వి.రవికుమార్ చౌదరి, కరస్పాండెంట్ శిరోప్రసాద్ వర్మ తదితరులు అభినందిస్తూ ధృవీకరణ పత్రాలు, పథకాలు అందజేశారు. కార్యక్రమంలో విభాగాధిపతులు వై.నిరీష, పి.లలిత అధ్యాపకులు సతీష్, మురళి, మాధురి తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ సాగుపై శిక్షణ

రేణిగుంట, నవంబరు 23 ప్రభాతవార్త: రేణిగుంట మండలం చైతన్యపురం రాస్ కృషి విజ్ఞాన కేంద్రం, కొత్త ఢిల్లీకి చెందిన భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి సహకారంతో నిర్వహిస్తున్న మోడల్ విలేజ్ ప్రాజెక్టు-నూనె గింజల్లో సామూహిక మొదటి తరహా ప్రదర్శనా క్షేత్రాల్లో భాగంగా వేరుశనగ సాగులో యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమం శనివారం జరిగింది. ప్రదర్శనా క్షేత్రాల నిమిత్తం పిచ్చాటూరు మండలం, అడవి కొడియంబేడు, కారూరు గ్రామ రైతులకు విశిష్ట రకం వేరుశనగ విత్తనాన్ని విత్తనశుద్ధి మందు పంపిణీ చేసినట్లుకేంద్ర సీనియర్ శాస్త్రవేత్త హెడ్ శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో కేవీకే సీనియర్ శాస్త్రవేత్త, హెడ్ శ్రీనివాసులు, శాస్త్రవేత్తలు దివ్య, రాముకుమార్, అనూష, పిచ్చాటూరు మండలం, అడవికొడియంబేడు, కారూరు గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

సీపీఎం మహాసభల గోడ పత్రికలు ఆవిష్కరణ

రేణిగుంట, నవంబరు 23 ప్రభాతవార్త: రేణిగుంట మండలం తారక రామానగర్ లో డిసెంబరు 1,2 తేదీల్లో సత్యవేడులో జరిగే సీపీఎం పార్టీ తిరుపతి జిల్లా 14వ మహా సభకు సంబంధించిన గోడపత్రికలను పార్టీ నేతలు శనివారం ఆవిష్కరించారు. ఏర్పేడు, రేణిగుంట మండలాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతీయ కన్వీనర్ హరినాథ్, కార్యదర్శి సత్యశ్రీ, సుజాత, రాజశేఖర్, శివానందం, సీఐటీయూ జిల్లా కార్యదర్శి మునిరాజ తెలిపారు.

బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ

కేవీబీ పురం, నవంబరు 23 ప్రభాతవార్త: రక్తహీనత ఏర్పడకుండా ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రం ద్వారా అందించే పౌష్టికాహారాన్ని సక్రమంగా వినియోగించు కోవాలని పిచ్చాటూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ సుమతి తెలిపారు. కేవీబీపురం మండలంలోని ఆదరం ఎస్టీ కాలనీలో అంగన్‌వాడీ సిబ్బంది శ్రీదేవితో కలసి డోర్ విజిట్ చేసి గర్భవతులకు, బాలింతలకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని అందించారు. గర్భవతులు, బాలింతలు తీసుకోవలసిన ఆరోగ్య సూత్రాలను వారికి వివరించారు. విధుల్లో బాధ్యతగా పని చేయాలని ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని ఎప్పటికప్పుడు లబ్ధిదారులకు అందించాలని ఆదేశించారు.

25న ఎన్టీఆర్ వజ్రోత్సవ సినీ గేయ గోష్టి

తిరుపతి హెల్త్, నవంబర్ 23 ప్రభాతవార్త : తెలుగు జాతిని విశ్వవ్యాప్తం చేసిన స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతి, వర్ధంతిల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా అభిమానులు ఎన్టీఆర్‌ను గుర్తు చేసుకుంటున్నారని అదే విధంగా 1949 నవంబర్ 25న విడుదలైన ఎన్టీఆర్ మొదటి చిత్రం మనదేశంను ప్రధానంగా తీసుకుని తాము ఎన్టీఆర్ వజ్రోత్సవ సినీ గేయ గోష్టిని తలపెట్టినట్లు ఆచార్య జి. బాలసుబ్రమణ్యం తెలియజేశారు. ఎస్వీ యూనివర్సిటీలోనిసెనేట్ హాల్ నందు ఈనెల 25వ తేదీ ఉదయం 10 గంటలకు నిర్వహించు ఈ కార్యక్రమానికి రాయలసీమ ప్రాంతంలోని ప్రముఖ ఎమ్మెల్యేలతో పాటు చెన్నై నివాసి, సినీ దిగ్గజం, రంగారావు హాజరుకానున్నారని ఆయన తెలిపారు.

పరిశోధనా ఫలితాలు రైతులకు అందాలి

తిరుపతి విద్య, నవంబర్ 23 ప్రభాతవార్త: రైతుల సంక్షేమమే ధ్యేయంగా పరిశోధనలు జరగాలని, వాటి ఫలితాలను రైతులకు అందేటట్లు చూడాలని పరిశోధనా సంచాలకులు డాక్టర్ పాలడుగు సత్యనారాయణ శాస్త్రవేత్తలకు సూచించారు. శనివారం ఆర్ ఎ ఆర్ ఎస్లో ప్రయోగాత్మకంగా సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ పంటలను ఆయన అధికారులు శాస్త్రవేత్తలతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ డాక్టర్ సుమతి,ఆర్ఎఆర్ఎస్ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

వన్నెకుల డైరెక్టర్‌కు సన్మానం

శ్రీకాళహస్తి,నవంబర్ 23 ప్రభాతవార్త : శ్రీకాళహస్తికి చెందిన వన్నెకుల క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ మిన్నలరవిని ప్రభుత్వం వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌గా అవకాశం కల్పించటంతో ఆ సామాజిక వర్గానికి చెందిన ప్రముఖులు శనివారం ఆయన్ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో పేట బాలాజిరెడ్డి, దొరై రాజరెడ్డి ఎంఎస్‌రెడ్డి, మునిరాజా యాదవ్, యాదగిరి,గోపాల్,పాస్టర్లు సుందర్‌రాజ్,గూడార్ మధు, కొండయ్య,సామ్‌మాపాల్, రవి,డానియల్ రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఉక్తలేఖన పోటీల్లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

శ్రీకాళహస్తి,నవంబర్ 23 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి భగవాన్ సత్యసాయి సేవా సమితి బాబా జన్మదినాన్ని పురస్కరించుకొని శ్రీకాళహస్తిలోని శ్రీరాంనగర్ కాలనీలో గల శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులకు రాష్ట్ర స్థాయిలో ఎస్సై రైటింగ్ పోటీలను నిర్వహించారు. ఈకార్యక్రమాల్లో డీన్ సుబ్రమణ్యం, ఇన్‌చార్జిలు త్రివేణి, వంశీ, మోహన్, భారతిలు పాల్గొన్నారు.

స్వామికి బిల్వార్చన,అమ్మవారికి కుంకుమార్చన

శ్రీకాళహస్తి,నవంబర్ 23 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న లక్ష బిల్వార్చన కుంకుమార్చనలను శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నారు. శనివారం అలంకార మండపంలో స్వామి అమ్మవార్ల ఉత్సవర్లకు గర్భగుడిలో లక్ష బిల్వార్చన, కుంకుమార్చనలు నిర్వహిం చారు. ఉత్సవర్లకు అలంకార గురుకుల్ రాజేష్ గురుకుల్ అఖండ హారతులిచ్చారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం ఒంటి గంట వరకు అంతరాలయ దర్శనాలకు బ్రేక్ పడింది. ఈ సేవలతో ఆలయంలో వేద పఠనంతో పునీతమౌతుంది.

శ్రీకాళహస్తిలో కాంగ్రెస్ పార్టీ సంబరాలు:

శ్రీకాళహస్తి,నవంబర్ 23 ప్రభాతవార్త : భారతదేశంలోని జార్ఖండ్,కేరళలోని వయనాడులో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయాన్ని పురస్కరించుకొని శ్రీకాళహస్తిలో కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. అత్యధిక మెజారిటితో గెలుపొందటం శుభ సూచకమని శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కర్త దామోదర్‌రెడ్డి వివరించారు. పార్టీ శ్రేణులకు స్వీట్లు పంచిపెట్టారు.ఈ కార్యక్రమాల్లో నాని,కరీముల్లా, నవీన్, ఆంటోని, మునిరాజా, తిరుపాల్, చందు,మారి, సంతోష్, అరుణ్, శంకర్ రఫీ,అన్సర్ తదితరుల సారధ్యంలో సంబరాలు జరుపుకున్నారు.

తిరుపతి డివిజన్

నేరాలపై అప్రమత్తంగా వుండాలి : ఎస్ఐ

నారాయణవనం, నవంబర్ 23 ప్రభాతవార్త : ప్రస్తుత తరుణంలో డ్రగ్స్, సైబర్ నేరాల పట్ల విద్యార్థులు జాగ్రత్తగా వుండాలని ఎస్ఐ కె.రాజశేఖర్ తెలిపారు. మండలంలోని శ్రీ వేదవ్యాస డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రస్తుతం విద్యార్థులు డ్రగ్స్‌కు అలవాటు పడినట్టు గుర్తు చేశారు. తలితండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తే విద్యార్థులు పెడదోమ పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నట్టు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనిల్‌కుమార్, అధ్యాపకులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి!

నారాయణవనం, నవంబర్ 23 ప్రభాతవార్త్త : పుత్తూరు-ఊతుకోట జాతీయ రహదారిలోని నారాయణవనం మండలం వెత్తలతడుకు వద్ద పిచ్చాటూరు నుంచి పుత్తూరు వైపు నడిచి వస్తున్న ఓ గుర్తు తెలియని వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందినట్టు ఎస్ఐ కె రాజశేఖర్ తెలిపారు. అతన్ని పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీలో భద్ర పరిచినట్టు చెప్పారు. ఎవరికైనా సమాచారం తెలిస్తే 9440900693 నంబర్‌కి సమచారం ఇవ్వాలని కోరారు.

వ్యాధులపై విద్యార్థులకు అవగాహన

నారాయణవనం, నవంబర్ 23 ప్రభాతవార్త : మండలకేంద్రంలోని నారాయణ వనం బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం మధ్యాహ్నం కుష్టువ్యాధి, దయేరియా, దోమల నివారణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా క్షయ, కుష్టు నివారణ అధికారి డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, స్థానిక వైద్యాధికారులు డాక్టర దర్శిత్‌రాజ్, డాక్టర్ రాగ సుధాలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా కళ్యాణ వేంకటేశ్వరుని ఊంజల్‌సేవ

నారాయణవనం, నవంబర్ 23 ప్రభాతవార్త : నారాయణవనంలోని కల్యాణ వెంకటేశ్వరుని ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. అంతకు ముందు అమ్మవారిని,స్వామివారిని సుప్రభాత సేవలతో మేల్కొలిపి అభిషేకించారు. అనంతరం అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సుమనోహరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. టిటిడి అధికారులు భక్తులకు అమ్మవారి ప్రసాదాలను అందించారు. ఆలయ పర్యవేక్షకులు నాగరాజు, ఆర్జితం ఇన్స్‌పెక్టర్ భరత్, సిబ్బంది కైలాసం, సాంబయ్య, మోహన్, మూర్తి, మురళి, అర్చకులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల సబ్సిడీ కోసం పోస్టల్ ఖాతా

వడమాలపేట, నవంబరు 23 ప్రభాతవార్త వడమాలపేట కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాల సబ్సిడీపొందాలంటే తపాలాశాఖ ఖాతాలు తప్పని సరిగా ఉండాలని ఆశాఖ సహాయ సూపరింటెండెంట్ ఆర్ముగం తెలిపారు. శనివారం వడమాలపేటలో తపాలా శాఖ ఖాతాల మహా మేళాలో వివిధ పోస్టల్ ఖాతాలను చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ధనంజయలునాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్ముగం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఒప్పందంతో భవిష్యత్‌లో వివిధ పథకాల సబ్సిడీ ద్వారా ఆర్థిక లావాదేవీలు పోస్టల్‌శాఖ ద్వారా లబ్ధిదారులకు అందుతున్నారు. కార్యక్రమంలో సబ్ పోస్టుమాస్టర్ కిషోర్, పోస్టు మెన్లు, టీడీపీ నాయకులు చిరంజీవి, ఆదెయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీ కాలభైరవ స్వామి మహాకాల రక్షక యాగం

నగరి, నవంబరు 23 ప్రభాతవార్త: నగరి పట్టణంలో వెలసి ఉన్న శ్రీ కాలభైరవ స్వామి క్షేత్రంలో అత్యంత వైభవంగా మహాకాల రక్షక యాగం జరిగింది. ప్రతినెల అష్టమి సందర్భంగా జరిగే విశేష పూజలో భాగంగా శనివారం సంవత్సరానికి ఒక పర్యాయం కార్తీక మాసంలో జరిగే అత్యంత విశేషమైన కార్తీక కాలష్టమి సందర్భంగా మహాకాల రక్షక యాగం విశేషంగా జరిగింది. తిరుపతి, శ్రీకాళహస్తి మొదలగు పుణ్యక్షేత్రం నుంచి విచ్చేసిన ప్రత్యేక ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో వైభవంగా అలంకరించిన ఉత్సవ మూర్తుల ముందు భాగంలో 22 కలశాలతో ప్రత్యేక పూజలు చేసి సిద్ధంగా ఉన్న యాగగుండలో మహా యాగ కార్యక్రమాలు నిర్వహించారు. నగరి, పరిసర ప్రాంతాల్లోని ఉభయ దారులు కాక తిరుత్తణి, పొద్దుటూరుపేట, ఆర్‌కే పేట, తిరుపతి, పుత్తూరు, నారాయణవనం, మొదలటు పట్టణాల నుంచి ఉభయ దారులు, భక్తులు పాల్గొన్నారు.

కాళభైరవునికి ప్రత్యేక పూజలు

రామచంద్రాపురం, నవంబర్ 23 ప్రభాతవార్త: రాయలచెరువు కట్టపై వెలసియున్న శ్రీశక్తి పీఠంలో శనివారం కాళభైరవునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీశక్తి పీఠం వ్యవస్థాపకులు కుర్తాళం పీ

ఈవర్షాలు.. మినుము సాగుకు ఊరట : ఎఓ

వెంకటగిరిరూరల్, నవంబర్ 23 ప్రభాతవార్త: మండలంలో రైతులు సాగు చేస్తున్న మినుము సాగులో తగు మేళుకువలు సూచినలు పాటిస్తే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు పోంద వచ్చునని మండల వ్యవసాయ శాఖ అధికారిణి సుజాత శనివారం తెలిపారు. ఈ సందర్భంగా అమె మాట్లడుతూ గత కొద్ది రోజులుగా కురిసి వర్షాలు మినుము పంట సాగుకు ఊరటనిచ్చిందని తెలియజేశారు. అదేవిదంగా మండలంలో రైతులు 250 హెక్టర్‌లల్లో మినుము సాగు చేస్తున్నరని ప్రస్తుతం మినుము సాగులో మచ్చ తెగులు, లద్దెపురుగు, వైరస్ వ్యాపిస్తుందని వ్యవసాయశాఖ వారి సూచనులు మేరకు తగు మొతాదులో మందులు వాడితే తెగుళ్ళు పూర్తిగా తక్కు ముఖం పడుతాయని తెలిపారు.

పాఠశాల విధుల్లో సమయ పాలన పాటించాలి

డక్కిలి, నవంబర్ 23 ప్రభాతవార్త; పాఠశాల విధుల్లో ఉపాధ్యాయలు సమయ పాలన పాటించడంతో పాటు విద్యార్థులకు విద్యను వారికి అర్థమయ్యేరీతిలో భొధించాలని ఎంఈవో కిల్లా వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం ఆయన మండలంలోని కమ్మవారిపల్లి ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి ఉపాధ్యాయులకు తగు సూచనలు ఇచ్చారు. అంతకుముందు కమ్మవారిపల్లి ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి మధ్యాహ్న భోజనంను పరిశీలించారు.

యుటీఎఫ్ స్వర్ణోత్సవ సభలు విజయవంతం చేయాలి

వెంకటగిరిరూరల్, నవంబర్ 23 ప్రభాతవార్త:ఆంధ్ర ప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ ఏర్పాడి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వెంకటగిరి పట్టణంలోని పింజల వీరయ్య ఫంక్షన్ హాల్ లో వెంకటగిరి, బాలాయపల్లి, డక్కిలి మండల శాఖల ఆధ్వర్యంలో స్వర్ణోత్సవ సంబరాలు మరియు మండల మహ సభలను విజయవంతం చేయాలని యుటీఎఫ్ సీనియర్ నాయుకులు కె ఉదయకుమార్ జిల్లా కార్యర్శి యం కుమారస్వామి, రాష్ట్ర కౌన్సిలర్ అదినారయణ సంయుక్తంగా తెలియజేశారు. ఈ కార్యక్రమానికి నాయుకులు, ఉపాధ్యానీ ఉపాధ్యాయులు అందురు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలియజేశారు.

కన్నులపండువగా శ్రీరామ పట్టాభిషేకం

సూళ్లూరుపేట, నవంబర్ 23 ప్రభాతవార్త : సూళ్లూరుపేట మండలం మంగళం పాడు గ్రామంలో వెలసి ఉన్న రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం శ్రీరామ పట్టాభిషేకం అంగరంగ వైభవంగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్చరణలతో శాస్త్రోక్తంగా స్వామివారి కల్యాణాన్ని కన్నులపండువగా జరిపారు. అనంతరం ఆలయం వద్ద నుంచి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. శ్రీరాముని ప్రత్యేక వేదికపై కొలువుతీర్చి సీతారామ లక్ష్మణ హనుమంతులను హారతులిచ్చి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై శ్రీరామ పట్టాభిషేకాన్ని తిలకించారు. కె.సెల్వన్ స్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

ఓటు హక్కు వజ్రాయుధం లాంటిది : ఆర్డీఓ

సూళ్లూరుపేట, నవంబర్ 23 ప్రభాతవార్త : ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని, దాన్ని సద్వినియోగం చేసుకునేందుకు ప్రతి ఒక్కరు ఓటు హక్కు విలువను తెలుసుకోవాలని ఆర్డీఓ కిరణ్మయి కోరారు. శనివారం గోకులకృష్ణ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొన్నారు. ప్రభుత్వం చేపట్టిన స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఈ అవగాహన సదస్సును జరిపారు. విద్యార్థులు 18 సంవత్సరాలు నిండిన వెంటనే ఓటు హక్కు నమోదు చేసుకోవాలన్నారు. 23, 24 తేదీలలో సూళ్లూరుపేట నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో బూత్ లెవల్ అధికారులు అందుబాటులో ఉంటారని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని ఆర్డీఓ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎస్‌వి నరసింహారావు, గోకులకృష్ణ కళాశాల ప్రిన్సిపాల్ ముచ్చకాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన

సూళ్లూరుపేట, నవంబర్ 23 ప్రభాతవార్త : సూళ్లూరుపేటలోని నవజీవన్ ఆర్గనైజేషన్, సిసిపియు ప్రాజెక్టు సంయుక్త ఆధ్వర్యంలో 'మీకు తెలుసా' కార్యక్రమంలో భాగంగా శనివారం బాలికల హైస్కూల్లో ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు మేనేజర్ బాలాజీ మాట్లాడుతూ హెచ్ఐడి, ఎయిడ్స్ లక్షణాలు ఏ విధంగా ఉంటాయి, అది సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులతో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థకు చెందిన మంజుల, హరిత, మరియమ్మ, శిరీష, రేవతి, ఉమా, వల్లిక, ఆర్.రేవతి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ ఫౌండేషన్‌చే పేదలకు బియ్యం పంపిణీ

సూళ్లూరుపేట, నవంబర్ 23 ప్రభాతవార్త : తడ మండలం తడకండ్రిగ గ్రామానికి చెందిన శ్రీకృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం సూళ్లూరుపేట పట్టణంలోని పేదలకు బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పేద వృద్ధ దంపతులైన పూల కృష్ణయ్య, కమలమ్మ దంపతులకు బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణ ఫౌండేషన్‌కు చెందిన నెల్లూరు నాగరాజు, కొలమల నందయ్యలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కోత

సూళ్లూరుపేట, నవంబర్ 23 ప్రభాతవార్త : సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం మండలాల్లో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ కోత విధించనున్నట్లు విద్యుత్‌శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆర్.శేఖర్ శనివారం తెలిపారు. మన్నారుపోలూరు సబ్ స్టేషన్‌లోని 220 కేవీ మరమ్మతుల కారణంగా ఈ మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు. వినియోగదారులు ఈ అసౌకర్యాన్ని గమనించి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పోలింగ్ కేంద్రాలు పరిశీలన

కోట, నవంబర్ 23 ప్రభాతవార్త : కోట మండలంలో 52 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. శనివారం తహశీల్దార్ కె.జయజయరావు కోట, చెందోడు, వెంకన్నపాలెం, తిన్నెలపూడి తదితర గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులపై ఆరా తీశారు. ఆయన వెంట డిప్యూటీ తహశీల్దార్ అబ్దుతుల్లా ఖాన్, పిఎల్ఓలు ఉన్నారు.

భూ ఆక్రమణలపై నిరసన

కోట, నవంబర్ 23 ప్రభాతవార్త : కోట మండలం చిట్టేడు గ్రామానికి చెందిన జమీలాకు సంబంధించిన కొంత భూమిని అదే గ్రామానికి చెందిన కొంతమంది ఆక్రమించుకొని దౌర్జన్యం చేస్తున్నారని బాధిత మహిళ శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసింది. ఆమె నిరసనకు కుటుంబ సభ్యులతో పాటు సిపిఐ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు షేక్ షాన్వాజ్, జిల్లా కమిటీ సభ్యులు సిరాజ్‌లు మద్దతు తెలిపారు. తన భూమిని ఇతరులు ఆక్రమించుకుంటున్నారని జమీలా ఆరోపించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ జయజయరావు మాట్లాడుతూ ఆ భూమిని బాధితురాలి బంధువులే ఆక్రమించుకున్నారని, ఆ సమస్య తన దృష్టికి కూడా వచ్చిందని తెలిపారు. విచారించి న్యాయం చేస్తామని తెలిపారు.

విద్యానగర్‌లో నేత్ర వైద్య శిబిరం

కోట, నవంబర్ 23 ప్రభాతవార్త : కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో శనివారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నెల్లూరుకు చెందిన స్మార్ట్ ఐ హాస్పిటల్ వారి సహకారంతో ఉచిత నేత్ర వైద్యశిబిరం జరిగింది. ఈ శిబిరాన్ని కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో తరచూ కళాశాలలో ఉద్యోగుల సంపూర్ణ ఆరోగ్యం కోసం నిర్వహిస్తుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సందీప్, అన్ని విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

గూడూరు డివిజన్

పంచాయతీల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే

నాయుడుపేట టౌన్, నవంబరు 23 ప్రభాతవార్త ; రాష్ట్రంలో గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేయడమే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని సూళ్ళూరుపేట శాసనసభ్యులు డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. స్వచ్ఛభారత్‌లో బాగంగా సూళ్ళూరుపేట నియోజకవర్గనికి మంజూరైన నాలుగు ట్రాక్టర్లును ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ చేతుల మీదుగా శనివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మాట్లడుతూ రాష్ట్రంలో పంచాయతీలను అభివృద్ధి చేయాలన్నదే చంద్రబాబు లక్ష్యమన్నారు. అందులో బాగంగా సూళ్ళూరుపేట నియోజకవర్గంలో మేజర్ పంచాయతీలైన పుదూరు, ఏకొల్లు, కోట పోలూరు, కారూరు పంచాయతీలకు నాలుగు ట్రాక్టర్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈకార్య క్రమంలో సూళ్ళూరుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రమణ్యం, తెదేపా నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

దుకాణదారులకు విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

కోట, నవంబర్ 23 ప్రభాతవార్త : కోటలోని ఆర్టీసీ దుకాణదారులకు పంచాయతీ అధికారులు, విద్యుత్‌శాఖ అధికారులు కలిసి మూడు రోజుల క్రితం విద్యుత్ సర్వీసులను తొలగించారు. ఈ నేపథ్యంలో దుకాణదారులు పలు విధాలుగా నష్టపోయారు. ఆ మేరకు దుకాణదారులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో హైకోర్టు ఆదేశాలతో శనివారం దుకాణదారులకు విద్యుత్ సరఫరాను విద్యుత్‌శాఖ అధికారులు పునరుద్ధరించారు.

సూళ్లూరుపేట వాసికి డాక్టరేట్

సూళ్లూరుపేట, నవంబర్ 23 ప్రభాతవార్త : సూళ్లూరుపేటకు చెందిన ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విజిలెన్స్, పోలీసు గ్రీవెన్స్ సెల్ డైరెక్టర్ భీమన శ్రీధర్‌రావుకు గౌరవ డాక్టరేట్ లభించింది. శ్రీధర్ రావుకు ఇటీవల హైదరాబాద్‌లోని చిక్కడ్‌పల్లి త్యాగరాయ గాన సభలో నిర్వహించిన హోప్ జియోలాజికల్ యూనివర్శిటీ ప్రతినిధులు ఈ డాక్టరేట్ అందజేశారు. ప్రస్తుతం అందజేసిన డాక్టరేట్ తనపై మరింత బాధ్యత పెంచిందని శ్రీధర్‌రావు తెలిపారు. సమాజ సేవలో నిమగ్నమై పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు.

అప్పు చెల్లించలేదని... ఉపాధ్యాయులపై దాడులు!

కోట, నవంబర్ 23 ప్రభాతవార్త:కోట మండలం చెందోడు గ్రామ యూపి పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న ఆదిశేషయ్యపై, తూర్పు కండ్రగ గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో మరో ఉపాధ్యాయుడు శేఖర్‌పై శనివారం అప్పు ఇచ్చిన వారు దాడులు చేసినట్లు కోట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు అందింది. గత రెండు నెలల నుంచి వడ్డీ డబ్బులు చెల్లించిన కారణంగా తమపై రాజా, మరో ఇద్దరు కలిసి బయటకు లాకొచ్చి కొట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ మేరకు ఎస్.ఐ పవన్ కుమార్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడులకు పాల్పబడిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

మర్డర్ కేసులో వీడిన మిస్టరీ

వాకాడు. నవంబర్ 23 ప్రభాతవార్త : మర్డర్ కేసులో మిస్టరీని ఛేదించి నలుగురు నిందితులను శనివారం వాకాడు పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు కథను మేరకు వాకాడు మండలం దుగ్గరాజుపట్నం ఈనెల 17 తేదీన అనుమానస్పద మృతి కేసులో గూడూరు గ్రామానికి చెందిన కనుపూరు శ్రీహరి (జెమిని) భార్యతో అక్రమ సంబంధం పెట్టుకున్న కొండ అనిత్ కుమార్ రెడ్డిని మందు పార్టీ పేరుతో కనుపూరు శ్రీహరి తన స్నేహితులతో కలిసి అనిత్‌రెడ్డి మర్డర్ చేసి దుబారాజపట్నం రోడ్ సైడ్ పొలంలో పడేశారని పోలీసులు తెలిపారు. గ్రామస్తులు సమాచారం కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేశామని సీఐ హుస్సేన్ భాష తెలిపారు. ఈ కేసులో వాకాడు ఎస్ఐ నాగబాబు, కోట ఎస్సై పవన్ కుమార్, చిట్టమూరు ఎస్సై చిన్న బలరామయ్య పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధిపై దృష్టి పెట్టండి

వాకాడు, నవంబర్ 23 ప్రభాతవార్త : మండలంలోని ఆగిన పనులకు, ప్రభుత్వం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మండల పరిషత్ అధ్యక్షులు కొడవలూరు అనసూయమ్మ అధికారులను కోరారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలోని స్త్రీ శక్తి భవనంలో సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ పడవలూరు అనసూయమ్మ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వంలో మండలంలోని అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. పనులపై సమీక్ష ఎప్పటికప్పుడు అధికారులతో కలెక్టర్ పర్యవేక్షణ చేస్తున్నప్పటికీ మండలపై అధికారులు పనితీరుపై తీవ్ర అసంతృప్తి ఉందన్నారు, ఇటీవల కలెక్టర్ జరిగిన సమీక్ష సమావేశంలో కలెక్టర్స్ స్పందన బాగుందన్నారు, మండల స్థాయి అధికారులు తీరు మార్చుకోవాలన్నారు, వాకాడు మండలంలోని బాలిరెడ్డిపాలెం ఆసుపత్రి శిథిల వ్యవస్థలో ఉందని వెంటనే ప్రత్యామ్నాయంగా మరమ్మతులు చేసే విధంగా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు, గత సంవత్సరం జరిగిన తుఫాను తాకిడికి గండులు పడ్డాయని, నదిలో హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం తొందరగా చేపట్టాలన్ని ప్రభుత్వాన్ని ఆయన కోరారు, తీర ప్రాంత గ్రామాలలో కనీస మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని ఆయన కోరారు. ఆగిన రోడ్లు అద్వానంగా ఉన్నాయని వెంటనే మంజూరు చేయాలని ప్రభుత్వ అధికారులు ను కోరారు. ఈ సర్వసభ సమావేశంలో మండల స్థాయి వివిధ శాఖ అధికారులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అన్నపూర్ణ రావు, డిప్యూటీ తాసిల్దార్ సందీప్ కుమార్, జడ్పిటిసి సభ్యులు రామకృష్ణ, మండల పరిషత్తు ఉపాధ్యక్షులు వెంకటరమణయ్య, ఎంపీటీసీ సభ్యులు పి. కృష్ణారెడ్డి, గిరి, కరుణాకర్, సర్పంచులు దువ్వూరు విజయభాస్కర్‌రెడ్డి, అనిల్ కుమార్‌రెడ్డి, బండి వెంకట రత్నమ్మ, పాపారెడ్డి రాజశేఖర్ రెడ్డి, బూథనం వెంకటరత్నం, మల్లాపూ నాగరాజు, శంకరమ్మ, పుల్లమ్మ, మండల స్థాయి అధికారులుసిబ్బంది తదితరులు ఉన్నారు.

శ్రీచౌడేశ్వరీదేవి సేవలో జనసేన ఎన్వీఆర్

పుంగనూరు, నవంబరు 23 ప్రభాతవార్త : మండలంలోని చదళ్ళలో శ్రీసప్తమాతృక చౌడేశ్వరీదేవి పూజా కార్యక్రమాలలో ఆలయ వ్యవస్థాపకుడు, జనసేన నియోజకవర్గనాయకుడు ఎన్.వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయంలో ఉదయం నుంచి శుక్రవారాభిషేకాలు, పుష్పార్చనలు నిర్వహించారు. వేణుగోపాల్‌రెడ్డి నిర్మించిన ఈఆలయంలో వెలసిన శ్రీసప్తమాతృకశ్రీచౌడేశ్వరీదేవి అమ్మవారి వారపూజలలో ఆయన ప్రతి శుక్రవారం కుటుంబసభ్యుల సమేతంగా పాల్గొంటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో అందరూ బాగుండాలని, నియోజకవర్గ అభ్యున్నతికి తనశాయశక్తులా కృషిచేస్తానన్నారు. కార్యక్రమాలలో ట్రస్టు ప్రధాన కార్యదర్శి శివకుమార్‌రెడ్డి, సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

రూ.4.70కోట్ల నిధులతో సిమెంటు రోడ్లు : ఎంపీ

చిత్తూరు, నవంబర్ 23 ప్రభాతవార్త: మహాత్మాగాంధీ ఆశించిన గ్రామ స్వరాజ్యం సిఎం నారా చంద్రబాబునాయుడు వల్లే సాధ్యం అవుతుందని, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు పేర్కొన్నారు. పార్లమెంటు సమావేశాలకు హాజరు కావడానికి ఢిల్లీ వెళ్తున్న ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు మాట్లాడుతూ చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని పల్లె ప్రాంతాల్లో సిమెంటు రోడ్లు నిర్మాణం కోసం 4.70 కోట్ల రూపాయలు ఎంపీ నిధులను మంజూరు చేసి రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు తెలిపారు. పల్లె ప్రాంతాల ప్రగతి కోసం కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని, పంచాయతీరాజ్ శాఖను బలోపేతం చేయడంతో పాటు గ్రామ పంచాయతీలకు కూటమి ప్రభుత్వం పూర్వవైభవం తీసుకువచ్చిందన్నారు.

మూడు గేట్లు మాత్రమే పనిచేస్తున్నాయి

వాకాడు, నవంబర్ 23 ప్రభాతవార్త : వాకాడు స్వర్ణముఖి బ్యారేజ్ గేట్లు మూడు మాత్రమే పనిచేస్తున్నాయని వాకాడు ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. శనివారం వాకాడు మండల పరిషత్ కార్యాలయంలోని సాధారణ సర్వ సభ సమావేశంలో శనివారం వాకాడు ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసులు మాట్లాడుతూ స్వర్ణముఖి బ్యారేజ్ గేట్లు మూడు మాత్రమే పనిచేస్తున్నాయని, మిగతా గేట్లన్నీ తుప్పు పట్టి ఉన్నాయని బ్యారేజీకి వరద ప్రవాహం ఉధృతమైతే బ్యారేజ్ గేట్లు మొరాయించడం తథ్యం అన్నారు. స్థానిక శాసనసభ్యులు, ఇరిగేషన్ ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలన్నారు.

జార్ఖండ్, వయనాడ్‌లో కాంగ్రెస్ గెలుపుపై సంబరాలు

తిరుపతి(రవాణా), నవంబర్ 23 ప్రభాతవార్త: జార్ఖండ్ రాష్ట్రంలో, వయనాడ్‌లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలవ డం ప్రజల మద్దతుఅని తిరుపతిలో ఆ పార్టీ నేతలు సంబరాలు చేసుకున్నారు. దేశంలో కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్తులేదని విమర్శించే రాజకీయపార్టీల విమర్శకులకు ఈ ఎన్నికల ఫలితాలు గుణపాఠం అని తిరుపతి సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు గౌడపేర చిట్టిబాబు అన్నారు. వయనాడ్‌లో ప్రజలు రాజీవ్‌గాంధీ కుటుం బానికి మద్దతుగా నిలవడం, గత ఎన్నికల్లో రాహుల్‌గాంధీని గెలిపించడం, ఇప్పుడు ప్రియాంక గాంధీని గెలిపించి కాంగ్రెస్‌కు ప్రజలు విజయం చేకూర్చిపెట్టారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ గెలుపుతో తిరుపతిలో ఆ పార్టీ నేతలు గౌడపేర చిట్టిబాబు, నెల్లూరుజిల్లా అధ్యక్షుడు మాంగాటి గోపాల్‌రెడ్డి, ఎస్సీ విభాగం అధ్యక్షుడు చిత్తూరు శివశంకర్, పిసిసి ప్రధాన కార్యదర్శులు వెంకట నరసింహులు, లోకేష్‌రెడ్డి, సుప్రజ. తలారి గోపి తదితరులు తిరుపతిలోని రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద బాణాసంచాల పేల్చి స్వీట్లు పంచిపెట్టారు.

జనసేన శంఖారావంకు రండి!

-చల్లాకు... వేణుగోపాల్‌రెడ్డి ఆహ్వానం

పుంగనూరు, నవంబరు 23 ప్రభాతవార్త : ఈనెల 25న పుంగనూరులో ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన శంఖారావం సభకు రావాలని నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ కన్వీనర్ చల్లా రామచంద్రారెడ్డిని జనసేన నాయకుడు ఎన్.వేణుగోపాల్‌రెడ్డి ఆహ్వానించారు. ఈమేరకు శనివారం చల్లాబాబును వేణు గోపాల్‌రెడ్డి వారి ఇంటికి వెళ్ళి మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర ప్రజలకు జరిగిన అన్యాయానికి, నేటికీ బానిసత్వం ఎదుర్కొంటున్న ప్రజలను ఆదుకోడానికి కూటమిలోని అన్ని పార్టీలు బలోపేతం కావాలని వారు అభిప్రాయపడ్డారు. ఇందులోభాగంగానే తాను జనసేన పార్టీలో ఇటీవల చేరడంతో తొలి సభ శంఖారావం ప్రదర్శనను సోమవారం ఉదయం పదిగంటలకు ప్రారంభించి, మధ్యాహ్నం ఒంటిగంటలకు సభ నిర్వహణతో ముగిస్తామన్నారు. ఈసభకు తెలుగుదేశం శ్రేణులను కూడా ఆహ్వానించామన్నారు.

కుటుంబ కథా చిత్రం "దేవకి నందన వాసుదేవ"

-హీరో అశోక్ గల్లాను ఆధరించండి! -మాజీ మంత్రి గల్లా అరుణకుమారి

చంద్రగిరి, నవంబర్ 23 ప్రభాతవార్త: "దేవకి నందన వాసుదేవ" కుటుంబ సమేతంగా ప్రతి ఒక్కరూ చూడదగిన చిత్రమని మాజీ మంత్రి గల్లా అరుణకుమారి అన్నారు. స్థానిక ఎస్వీ సినిమాస్‌లో శనివారం ఆమె తన మనవడు (అమర రాజ బ్యాటరీస్ అధినేత, మాజీ ఎంపి జయదేవ్ గల్లా తనయుడు) అశోక్ గల్లా నటించిన దేవకి నందన వాసుదేవ చిత్రాన్ని పూతలపట్టు టిడిపి ఎంఎల్ఏ డాక్టర్ కలికిరి మురళీమోహన్‌తో కలసి వీక్షించారు. అంతకు ముందు ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈ చిత్రం సనాతన ధర్మాన్ని అనుసరించి తెరకెక్కించారని అన్నారు. స్వేచ్ఛ గురించి చక్కగా తెలియజేశారని అన్నారు. ఒక తల్లి మాతృప్రేమ ఔన్నత్యాన్ని చక్కగా వివరించారని అన్నారు. చాలా రోజులకు ఒక మంచి చిత్రాన్ని చూశానని తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఇప్పటికే ఈ చిత్రం సూపర్ హిట్ అయినట్లు అభినందనలు, ప్రశంసలు వస్తున్నట్లు తెలిపారు. మొదటిరోజున తిరుపతిలో సినిమాను వీక్షించే క్రమంలోనే అనేక మంది కాల్ చేసి తమ అభిప్రాయాన్ని చెప్పినట్లు వివరించారు. అద్భుతమైన డ్యాన్స్, ఫైట్స్ వున్న ఈ చిత్రాన్ని ప్రతి ఒక్కరూ కుటుంబ సమేతంగా చిత్రాన్ని తిలకించి హీరో అశోక్ గల్లాను ఆధరించాలని కోరారు. అనంతరం ఎంఎల్ఏ కలికిరి మురళీమోహన్ మాట్లాడుతూ హీరో అశోక్ గల్లా సినీ కెరియర్‌లో మరెన్నో విజయాలతో స్టార్‌డమ్ సాధించాలని ఆకాంక్షించారు. నంతరం టిడిపి నాయకులు శానంబట్ల సురేష్‌రెడ్డి, ఏజి పల్లి బాల, హేమాంబర్‌ధరరావు, బడి సుధాయావ్, గౌస్‌భాషా, రెడ్డివారిపల్లి నాగరాజ రాయల్, హరి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు డాక్టర్ వాసు, వైసిపి నాయకుడు మస్తాన్, కార్యకర్తల సమక్షంలో కేక్‌కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలి

తొట్టంబేడు, నవంబర్ 23 ప్రభాతవార్త : చిన్నారులు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అర్బన్ సిఐ డి.గోపి తెలిపారు. స్థానిక ధర్మరాజులగుడి వద్ద ఉన్న శ్రీచైతన్య-3 బ్రాంచిలో సేఫ్ ఇండియా వేడుకల క్యాక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా అర్బన్ సిఐ గోపి విచ్చేయగా, కార్యక్రమానికి ప్రిన్సిపల్ నిరోషా అధ్యక్షతన వహించారు. అర్బన్ సిఐ గోపి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధ నలు పాటించాలని విద్యార్థులు ద్విచక్ర వాహనాలు వాడరాద న్నారు. డీన్ సురేంద్ర, ఇన్‌ఛార్జిలు రమేష్, సోనియా, సిసిఎ ఇన్‌ఛార్జి చందన, పిఈటి శంకర్, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీని రంగంలో రాణిస్తున్న... పార్లపల్లి కుర్రాడు

-పుష్ప-2లో అల్లుఅర్జున్‌తో కలసి...

'వార్త 'సండే స్పెష్షల్..

అల్లు అర్జున్‌తో..

-డైరెక్టర్ సుకుమార్‌తో కలసి ఉన్న చిత్రం



పార్లపల్లికి చెందిన యువకుడు అశోక్‌కుమార్

శ్రీకాళహస్తి, నవంబర్ 23 ప్రభాతవార్త : తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పట్టణం కళలకు, క్రీడలకు కాణాచి అంతేకాకుండా ముఖ్యంగా కలంకారి ప్రసిద్ధిచెందిన పట్టణం. శ్రీకాళహస్తికి సమీపంలోని బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని పార్లపల్లి గ్రామానికి చెందిన కుర్రాడు సినీరంగంలో రాణిస్తున్నాడు. బుచ్చి నాయుడు కండ్రిగ మండలం పార్లపల్లి గ్రామానికి చెందిన శంకర్‌రెడ్డి, రమా మణిలకు ముగ్గురు కుమారులు వీరిలో ఒకరు విజయకుమార్, కోదండరాం, మూడో కుమారుడు అశోక్‌కుమార్ స్కిమ్స్‌లోని